ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 10 అక్టోబరు 2025





ఈదగాలిలో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పక్కన ఎస్పీ అజిత వేజెండ్ల ఇతర అధికారులు


అనుకూలించని వాతావరణం

- సీఎం పర్యటనలో మార్పు
- స్మార్ట్ స్ట్రీట్ బజారు ప్రారంభం వాయిదా
- విశ్వసముద్ర బయో ఇథనాల్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

నెల్లూరు (సిటీ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పర్యటనలో స్వల్పమార్పు చోటు చేసుకుంది. తొలుత శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు చంద్రబాబు అమరావతిలోని సచివాలయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.20 గంటలకు కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకోవాల్సి ఉంది. ఆ తర్వాత నెల్లూరు సిటీలోని మైపాడు గేట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్‌ను సీఎం ప్రారంభించాల్సి ఉంది. అనంతరం 3.15 గంటలకు వెంకటాచలం మండలం ఈదగాలి వద్ద నిర్మించిన నందగోకులం స్కూల్ ప్రాంగణానికి విచ్చేస్తారు. తొలుత స్కూల్‌ను, ఆ తర్వాత గోశాలను చంద్రబాబు సందర్శిస్తారు. ఈ సందర్భంగా విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగిస్తారు. అక్కడ నుంచి సాయంత్రం 5.25 గంటలకు హెలికాప్టర్‌లో విజయవాడకు తిరుగు పయనమవుతారు. అయితే, వాతావరణం అనుకూలించకపోవడంతో నెల్లూరు నగరంలో స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రారంభం వాయిదా పడింది. మిగతా కార్యక్రమాలు యథావిధిగా జరగనున్నాయి.

ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. వెంకటాచలం మండలం సర్వేపల్లి సమీపంలో ఈదగాలి గ్రామంలో గ్రామంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిశీలించి, విశ్వసముద్ర బయో ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రతినిధులతోపాటు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేష్, ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతంతోపాటు చుట్టు పక్కల అంతా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల, ఇతర అధికారులు ఏర్పాట్లు, భద్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



నిధులు లేక.. పనులు కాక!

సీఎం సార్.. ఈ ప్రాజెక్టులు చూడండి

పనులే కాదు.. నిర్వహణనూ గాలికొదిలేశారు!

నెల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి రంగంలో కీలకమైన ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. జిల్లాలో కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టుల పనులు జరుగుతున్నా మరికొన్ని ప్రాజెక్టులకు అడుగులు ముందుకు పడడం లేదు. వాటిలో సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ, బండేపల్లి-దేగపూడి కాలువ నిర్మాణం, నెల్లూరు, సంగం బ్యారేజీల నిర్వహణ ప్రధానమైనవి. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈ కీలకమైన ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని జిల్లా రైతాంగం కోరుకుంటోంది.

● బ్యారేజీలకు నిర్వహణ లేదు

సోమశిల, కండలేరు జలాశయాలు జిల్లాకు ఎంతటి జీవనాడి వంటివో.. సంగం, నెల్లూరు బ్యారేజీలు కూడా అంతే. ఆ రెండు జలాశయాలు నీటిని నిల్వ చేస్తే, ఈ రెండు బ్యారేజీలు ఆ నీటిని కాలువలకు మళ్లిస్తూ సాగులో కీలకంగా ఉంటున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత గల బ్యారేజీలను రూ.500 కోట్లతో నిర్మించారు. అయితే ఈ బ్యారేజీల నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. నాడు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి ముందుచూపు లేకుండా పనులు పూర్తికాకుండా బ్యారేజీలను ప్రారంభించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అదే నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. ఈ రెండు బ్యారేజీల వద్ద ఉన్న గేట్లను ఎత్తేందుకు, దించేందుకు ఒక్కరంటే ఒక్క టెక్నికల్ ఆపరేటర్ కూడా లేరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వైసీపీ హయాంలోనే ఇరిగేషన్ అధికారులు జిల్లా నుంచి బ్యారేజీల నిర్వహణకు ప్రతిపాదనలు పంపుతున్నారు. కానీ రాష్ట్ర అధికారులు మాత్రం ఏ నిర్ణయం తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



సంగం బ్యారేజీలో 88 గేట్లు ఉండగా నెల్లూరు బ్యారేజీలో 57 గేట్లు ఉన్నాయి. వీటి ఆపరేషన్స్ కోసం సంగం బ్యారేజీ నిర్వహణకు 28 మంది, నెల్లూరు బ్యారేజీ నిర్వహణకు 20 మంది అవసరమని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు బ్యారేజీల ఫలితంగా ఏటా రూ.వేల కోట్ల పంట ఉత్పత్తులు వస్తున్నా ఏడాదికి రూ.2 కోట్లతో నిర్వహణ చేయలేకపోతున్నారు.

● ప్రమాదంలో సర్వేపల్లి రిజర్వాయర్

డెల్టా ప్రాంతంలోని ప్రధాన నీటి వనరుల్లో ఒకటైన సర్వేపల్లి రిజర్వాయర్ కింద 15,735 ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారికంగా మరో ఐదు వేల ఎకరాలు ఉన్నట్టు అంచనా. 1.73 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ ఆయకట్టుకు నీరు అందించడమే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటిని కూడా అందిస్తోంది. ఈ రిజర్వాయర్ నుంచే కృష్ణపట్నం పోర్టుతోపాటు పరిసరాల్లోని పరిశ్రమలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఎప్పుడో బ్రిటీషు కాలంలో నిర్మించిన ఈ రిజర్వాయర్‌ను ఆ తర్వాత తగిన రీతిలో ఆధునికీకరించలేదు. భారీ వర్షాలు కురిస్తే ఈ రిజర్వాయర్ కట్ట తెగిపోయే ప్రమాదముందని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి కూడా నివేదిక అందజేశారు. అదే సమయంలో సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధికిగాను ఇరిగేషన్ శాఖ అధికారులు రూ.50.41 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు ఆర్థిక శాఖ వద్దకు వెళ్లి వెనక్కు వచ్చాయి. గతంలో ఇదే రిజర్వాయర్‌ను సీఎం హోదాలో చంద్రబాబు పరిశీలించారు. ఇప్పుడు కూడా ఆయన చొరవ తీసుకుంటేనే సర్వేపల్లికి ప్రమాదం తప్పుతుంది.

● బండేపల్లి-దేగపూడికి గ్రహణం

2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో బండేపల్లి-దేగపూడి కాలువకు మోక్షం లభించింది. రూ.30 కోట్లతో కాలువ నిర్మాణ పనులు అప్పట్లోనే మొదలయ్యాయి. ఇప్పటివరకూ 30 శాతం మేర పనులు జరిగాయి. ప్రస్తుతం కాంట్రాక్టర్ పనులు చేయడం లేదు. ఆ కాంట్రాక్టర్ కాకపోతే మరొకరి ద్వారానైనా పనులు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

కొత్త టీచర్లు వచ్చేస్తున్నారు..! | వీధి వ్యాపారులకు 'పీఎం స్వనిధి' 8



జలదంకి ప్రాంతంలో దళారులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు (ఫైల్)

రైతుల కష్టం.. దళారులపాలు!

- చివరి దశకు ధాన్యం విక్రయాలు
- ఆలస్యంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- ఈలోపు దళారులకు అమ్మేసిన అన్నదాతలు
- 'మద్దతు' లేక రూ.200 కోట్ల నష్టం

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడటంతో జిల్లాలో ఖరీఫ్ కింద రైతులు సుమారు.1.8 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడం, సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం పుట్టి రూ.19,725 ఉండగా, రైతులు దళారులకు పుట్టి రూ. 14వేల నుంచి 14,500 వరకు విక్రయించారు. కాగా జిల్లాలో 1.8లక్షల ఎకరాల్లో చేతికొచ్చిన పంట దిగుబడిని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే నాటికి మూడో వంతు విక్రయించారు. దీంతో జిల్లా రైతులు సుమారు రూ.200 కోట్ల మేర నష్టపోయారు. ఎకరాకు సుమారు మూడు పుట్లు పండగా, ఒక్కో రైతు ఎకరాకు రూ.15 వేల వరకు నష్టపోయారు.

● ఎవరికి లాభం

చేతుల కాలాక ఆకులు పట్టుకున్నట్లు... రైతులకు జరగాల్సిన నష్టం జరిగాక అధికారులు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అది కూడా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కొనుగోలు కేంద్రాలు లేక రైతులు నష్టపోతున్న విషయాన్ని గతనెల 22న అసెంబ్లీలో ప్రస్తావించారు. దీంతో రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు తర్జనభర్జన పడి, రైస్‌మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అప్పటికే అల్లూరు ప్రాంతంలో పూర్తిగా విక్రయాలు జరిగిపోయాయి. కావలి కాలువ ప్రాంతాలైన జలదంకి, బోగోలు,దగదర్తి, కావలి ప్రాంతాల్లో కూడా 70 శాతం వరకు ధాన్యం విక్రయాలు పూర్తయ్యాయి.

అయితే ఇప్పుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు వల్ల రైతులకు పెద్దగా ఒరిగేదేమీ లేదు. దళారులు కొనుగోలు చేసిన ధాన్యం మిల్లర్లకు చేరి ఉండటంతో ఆ ధాన్యాన్నే మిల్లర్లు కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకున్నట్లు చూపించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మిల్లర్లు పొందే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. రైతులకు ఇంకా మిల్లర్లు డబ్బులు ఇవ్వనందున, రైతుల కూడా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మినట్లు చూపిస్తే త్వరగా డబ్బులు వస్తాయని మిల్లర్లు చెప్పినట్లుగా చేస్తారు. ఇంకా రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లర్లకు అమ్మాలంటే ధాన్యంలో తెల్లపొట్ట ఉన్నందున, అవి మిల్లింగ్ చేస్తే విరుగుడు ఎక్కువగా వచ్చి బియ్యం తగ్గుతాయని చెప్పి మిల్లర్లు పుట్టికి 50 కిలోలు అదనంగా అడుగుతున్నారని అన్నదాతలు అంటున్నారు.



అల్లూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం

ఇప్పుడెందుకు...?



వరి కోతలు పూర్తయ్యాక ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పుడు ఎందుకు...? వరికోతల సమయంలో ఏర్పాటు చేసి ఉంటే రైతులకు గిట్టుబాటు ధర వచ్చేది. కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో పత్తాలేని కొనుగోలు కేంద్రాలు అంతా పూర్తయ్యాక ఏర్పాటు చేయటం ఎందుకు...?

- పాడేటి రాజశేఖర్, అల్లూరు

దొంగలు పడ్డ ఆర్నెల్లకు..



వరికోతలు పూర్తయి, విక్రయాలు అయిపోయాక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం.. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మరిగినట్టుగా ఉంది. కొనుగోలు కేంద్రాలు లేనందున ఒక్కో రైతు పుట్టికి రూ.5,000నుంచి రూ. 6,000 వరకు నష్టపోయాడు.

- కొండూరు గోవిందు, రైతు అల్లూరు

ప్రభుత్వ సహకారమేదీ..?



ప్రకృతి సహకరించినా, ప్రభుత్వం సహకారం లేక రైతులు నష్టపోయారు. నేను 32 ఎకరాల్లో ఎడగారు కింద వరి సాగు చేశా. ఎకరానికి 3పుట్ల వంతున 36పుట్లు ధాన్యం రాగా, పుట్టి రూ.14,000 వంతున విక్రయించా. మరో 20ఎకరాల్లో ఎకరానికి మూడన్నర పుట్ల వంతున 70పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ రకం ధాన్యం పుట్టి రూ.15000 వంతున విక్రయించా. మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దాదాపు రూ.4లక్షలు నష్టపోయా.

- బీవీ. క్రిష్ణారెడ్డి, సర్పంచి, ఆదర్శరైతు, వేములపాడు, జలదంకి మండలం

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

- ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి : ఫ్యాప్టో

నెల్లూరు(విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘం ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం డీఈవో బాలాజీరావుకు వినతిపత్రం ఇచ్చారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో బోధనకు సమయం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నా పట్టించుకోకపోవడంతో బహిష్కరణకు సిద్ధమైనట్లు తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, మూల్యాంకనానికి సంబంధించిన పనులు మాత్రమే చేపడతామని స్పష్టం చేశారు. గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జీఎస్‌టీ 2.0 వంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలు ఇకపై చేపట్టబోమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ఛైర్మన్ కే మధుసూదన్ రావు, సెక్రటరీ జనరల్ షేక్ జావీద్, కోఛైర్మన్లు పీ మురళీకృష్ణ, మాస ప్రసాద్, పీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత యువతే లక్ష్యం

- టీఎఫ్‌వైసీ 3.0 ప్రారంభం
- 60 రోజులు అవగాహన కార్యక్రమాలు



పోస్టర్ విడుదలలో డీఎంహెచ్‌వో, ఎన్‌సీడీ అధికారులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : యువతను పొగాకు ఉత్పత్తుల వాడకం నుంచి దూరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిన టుబాకో ఫ్రీ యూత్ క్యాంపెయినింగ్ (టీఎఫ్‌వైసీ) 3.0 కార్యక్రమం మొదలైంది. దీనికి సంబంధించిన పోస్టర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో సుజాత గురువారం విడుదల చేశారు. పొగాకు రహిత యువత కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ అవగాహన కార్యక్రమాలు గురువారం నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే నష్టాలపై ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో యువతకు అవగాహన కలిగించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డెమో కనకరత్నం, ఎన్‌సీడీ వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ హబ్‌గా కరేడు

- పోర్టు ఆధారిత పరిశ్రమలతో ఉపాధి, ఉద్యోగావకాశాలు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పోర్టు ఆధారిత పరిశ్రమల రాకతో కరేడు గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయని, ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త నాంది పలకనుందని పేర్కొన్నారు. మొత్తం 4800 ఎకరాల భూసేకరణ అవసరం కాగా ఇప్పటివరకు 515 ఎకరాలకు సంబంధించి రైతులకు అవార్డు పాస్ చేసినట్లు తెలిపారు. భూసేకరణకు ప్రభుత్వానికి సహకరిస్తూ మన ప్రాంతాల అభివృద్ధికి ముందుకొస్తున్న రైతులకు కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. పరోక్షంగా వ్యాపారాలు, రవాణా, సేవా రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. ఇది కేవలం కరేడుకు మాత్రమే కాకుండా మొత్తం జిల్లాకు ఒక పెద్ద ఆర్థిక బలం కలిగించనుందని చెప్పారు. పరిశ్రమల కోసం తమ భూములను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయపరమైన పరిహారం అందిస్తుందని వివరించారు. కరేడులో ఏర్పడిన ఈ భూసేకరణ భవిష్యత్ తరాలకు ఒక అభివృద్ధి పథమని అన్నారు.

'సోమశిల'కు 16,180 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 16,180 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 72.471 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గేట్ల ద్వారా 20వేలు, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలకు బ్రేక్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్య సేవలను శుక్రవారం నుంచి నెట్‌వర్క్ ఆసుపత్రులలో నిలిపి వేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎల్వీ నారాయణ రావు ఒక ప్రకటనలో తెలియచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.2,700 కోట్ల బకాయిలు ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 25వ తేదీన ఆశా రాష్ట్ర కార్యవర్గ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించిందని, ఆందోలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సంతపేట సీఐపై వేటు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను నగరంలోని సంతపేట పోలీస్‌స్టేషన్ సీఐ దశరథ రామారావును సస్పెండ్ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6వ తేదీన అర్ధరాత్రి పెన్నా బ్యారేజీ సమీపంలో జంటహత్యలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సీఐను సస్పెండ్ చేశారు.

మసక నేత్రం



నెల్లూరు : జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద పని చేయని సీసీ కెమెరాలు

నేర నియంత్రణకు, నేరస్థులను గుర్తించేందుకు జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మొండికేశాయి. వీటి నిర్వహణ విషయంలో పోలీసులు పట్టీపట్టనట్టు వ్యవహరించడంతో స్తంభాలకు దిష్టిబొమ్మల్లా మారాయి. దీంతో ఎన్నో కేసుల్లో దర్యాప్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల నెల్లూరులోని పెన్నా వారధి సమీపంలో జరిగిన జంట హత్యలు జరిగిన విషయం తెలిసిందే. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నా పని చేయకపోవడంతో నేర శోధనకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- వివరాలు 8లో..

కండలేరు జలాశయం నీటి నిల్వ 59.206 టీఎంసీలు

రాపూరు, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.206 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుండి 3400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుండి 1480 క్యూసెక్కుల నీరు వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11738
వెండి కిలో ధర	రూ. 163000
వెండి ఒక గ్రాము	రూ. 167.00

'ఉపాధి'లో బోగస్‌కు అడ్డుకట్ట!

- ప్రతి జాబ్‌కార్డుకూ ఈకేవైసీ
- 15 వరకు గడువు

మనుబోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో బోగస్‌ల ఏరివేతపై ప్రభుత్వం దృష్టి సారించింది. అనర్హుల జాబ్‌కార్డులు ఎత్తివేయడంతో పాటు, దొంగ మస్టర్లకు చెక్ పెట్టాలన్న ప్రధాన ఉద్దేశంతో ముందు కు వెళుతోంది. ప్రతీ జాబ్ కార్డుకూ ఈకేవైసీ చేయించా లన్న ఉన్నతాధికారుల ఆదేశాలను డ్వామా అధికారులు క్షేత్రస్థాయిలో అమలుచేస్తున్నారు. ఏటా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలో బోగస్ మస్టర్ల మాయాజాలం వెలుగు చూస్తోంది. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న కూలీలు, వాస్త వంగా పనిచేస్తున్న కూలీల సంఖ్యకు పొంతన ఉండడం లేదు. పలుచోట్ల బోగస్ హాజరు వేసి నిధులు స్వాహా చేస్తున్నారు. ఈ తంతు అన్ని పంచాయతీలు, మండలా ల్లోనూ సర్వసాధారణమైపోయింది. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను చేపట్టింది. అలాగే ముఖహాజరును అమలు చేయాలని నిర్ణయించింది. ఈకేవైసీ, ముఖహాజరు వల్ల పథకంలో యంత్రాల వినియోగంతో పాటు, పని ప్రదేశం మార్పు, దొంగ ఫొటో లు, ఒకరికి బదులు మరొకరు పనికి రావడం, కూలీల సంఖ్యను అధికంగా చూపడం వంటి వాటికి బ్రేక్ పడు తుందని అధికారులు భావిస్తున్నారు. ఇక నకిలీ జాబ్ కార్డు లకు అవకాశం ఉండదు. మండలంలోని 19 పంచాయతీల్లో డ్వామా అధికారులు ఇచ్చిన గణాంకాల ప్రకారం 7673 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 13,366 మంది సభ్యులు గా ఉన్నారు. అయితే యాక్టివ్ కూలీలు కేవలం 3600 మాత్రమే ఉన్నారు. ఇప్పటివరకు ఈకేవైసీ కింద 2250 మంది కూలీల వివరాలు నమోదు చేశారు.


పనిప్రదేశంలో కూలీల ఈకేవైసీ చేస్తున్న క్షేత్ర సహాయకుడు

తగ్గనున్న మెటీరియల్ కోటా నిధులు

ఉపాధి హామీ పథకం కింద చేసే పనుల మొత్తం అంచనాలో 60 శాతం కూలీలు చేయాల్సి ఉండగా, 40 శాతం నిధులను మాత్రమే కేంద్రం మెటీరియల్ కోటా కింద ఇస్తుంది. కూలీలు చేసిన పని ప్రకారమే మెటీరియల్ కోటా నిధులు వస్తుంటాయి. కూలీల సంఖ్య పెంచాలన్న ఉన్నతాధికారుల ఒత్తిడితో సిబ్బంది ఏదో విధంగా కూలీల సంఖ్యను అధికంగా చూపుతూ వస్తుంటారు. ఇక నుంచి ఈ ప్రక్రియకు అడ్డుకట్ట పడనుంది. వేలిముద్రలు, ముఖ ఆధారిత డిజిటలైజేషన్ ద్వారా బోగస్ కూలీల సంఖ్య తగ్గిపోనుంది. దీని ద్వారా కేంద్రం ఇచ్చే మెటీరియల్ కోటా నిధులు తగ్గిపోయే అవకాశం ఉంది. వారం రోజులుగా గ్రామాల్లో జాబ్‌కార్డుల కలిగిన కూలీల వివరాలు, వేలిముద్రలు, ముఖహాజరు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ యాప్‌లో క్షేత్రసహాయకులు నమోదు చేస్తున్నారు. దీని ద్వారా నిజమైన కూలీలకు న్యాయం జరుగుతుంది. చేసిన పనిని బట్టి కూలీలకు అధిక వేతనం వస్తుంది.

ఈకేవైసీ చేయించకపోతే జాబ్‌కార్డు రద్దు



జాబ్‌కార్డు పొందిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించాలి. పనికి వచ్చినా, రాకున్నా ఈకేవైసీ చేయాలి. లేకుంటే కార్డు రద్దవు తుంది. కార్డు ఒక్క పని కోసమే కాదు, ప్రభుత్వం ఇస్తున్న హౌసింగ్, ఉద్యాన పం టలు, ఇతర పథకాల కోసం అవసరమవుతుంది. ఒకసారి రద్దయితే మళ్లీ జాబ్ కార్డులు ఇవ్వరు. అందుకే క్షేత్ర సహాయకుల వద్ద ఈకేవైసీ చేయించాలి.
- రాజమ్మ, ఏపీవో

19న మందకృష్ణ నెల్లూరుకు రాక

పొదలకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నెల్లూరుకు రానున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు మందా వేంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూరిపాక ఉదయకృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. మందకృష్ణ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, పొదలకూరు మండల ఎస్ఎస్ఎల్ అధ్యక్షుడు కొంగి రమణ్య మాదిగ, శేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రేపు హాస్టల్ భవనానికి శంకుస్థాపన

మనుబోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పీఎం అజయ్ యోజన పథకం కింద రూ.3 కోట్లతో మనుబోలు ఎస్సీ బాలికల వసతి గృహం భవన నిర్మాణానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేతుల మీదుగా శనివారం శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామ కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోషకాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మి

మనుబోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణిలు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని కట్టువపల్లిలో గురువారం 8వ జాతీయ పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. టీహెచ్‌ఆర్‌ను ఉపయోగించుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆది నారాయణమ్మ, కార్యకర్తలు రమణమ్మ, రాధ, ఉమామహేశ్వరి, కల్పన, రవణమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించండి

పొదలకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వాల హయాంలో ఉన్న జర్నలిస్టు సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు మన్నెపల్లి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీరామ్ మాట్లాడారు. జర్నలిస్టు హెల్త్‌కార్డు పరిమితి రూ.2లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంపీఏ నెల్లూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు కామంచి హజరత్, ప్రధాన కార్యదర్శి మేకల ప్రభాకర్, కార్యవర్గసభ్యులు కల్లూరు సుధాకరరెడ్డి, ఏపీ ఎంపీఏ సభ్యులు, పొదలకూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

ముళ్లచెట్ల తొలగింపు

మనుబోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ముళ్లచెట్లు, పిచ్చి చెట్లు పెరిగిపోయి పిల్లలకు అసౌకర్యంగా ఉందని, వాటిని తొలగించాలని ఇటీవల పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ప్రధానకార్యదర్శి పచ్చిపాల రామిరెడి గురువారం ఎస్కవేటర్ సాయంతో ముళ్ళ చెట్లను తొలగించి శుభ్రం చేయించారు.

జీఎస్టీపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ ప్రత్యేక అధికారి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రమేష్ నాయక్ పర్యవేక్షణలో గురువారం బుచ్చిరెడ్డిపాళెంలోని డీసీహెచ్ఎస్ ఆసుపత్రిలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీహరి, ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబానికి పక్కాగృహం మంజూరు

ఆత్మకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో ఏళ్ల తరబడి తలదాచుకునేందుకు సరైన గూడు, ఉపాధిలేక ఇబ్బందులు పడు తున్న జ్ఞానమ్మ కుటుంబానికి పీ-4 పథకంతో ఊరట లభించింది. ఆమెకు ప్రభుత్వం పక్కాగృహాన్ని మంజూరు చేసింది. గురువారం ఆత్మకూరు ఆర్డీవో బి పావని పక్కాగృహం నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నేతలు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచల చౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, హౌసిం గ్ ఈఈ మోహన్‌రావు, డీఈ కె రవి, ఏఈ శరత్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులను శ్రద్ధగా చదివించాలి

పొదలకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులను ఇప్పటి నుంచి శ్రద్ధగా చదివించి ఉత్తమ ఫలితాలు రాబట్టేలా చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి అన్నారు. గురువారం పట్టణంలోని ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాల యంలో వసతి గృహాల వార్డెన్స్‌తో సమావేశం నిర్వహించారు. వారం వారం విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. వసతి గృహాల లోపల, బయట ఆవరణం శుభ్రత ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు ఆహారం వేడివేడిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి

తాటిచెట్టుపై పిడుగు.. తప్పిన ప్రమాదం

మనుబోలు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మనుబోలు పొలాల్లో గురువారం వేకువజామున 3గంటల ప్రాంతంలో తాటిచెట్టుపై పిడుగుపడింది. అయితే చెట్టుకు నలువైపుల 5 గిరిజన పాకలు ఉన్నాయి. పిడుగుపాటుతో చనగా శీనయ్య అనే వ్యక్తి ఎడమకన్ను చూపు తగ్గింది. సెల్‌ఫోన్లు కాలిపోయాయి. అదృష్టవశాత్తూ పూరిపాకలపై పిడుగుపడలేదు. లేదంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. రైతులు వీఆర్‌వో నాగార్జునరెడ్డికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన పిడుగుపడిన ప్రదేశానికి వెళ్లి గిరిజనుల నుంచి వివరాలు సేకరించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేసిన రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి అన్నారు. గురువారం మండలంలోని కాకొల్లువారిపల్లిలో కె రామ్మోహన్ అనే రైతు సాగు చేసిన మామిడి పంటను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో రాజ్‌కుమార్, ఏడీపీవో మునిరత్నం, ఏడీఏ నర్సోజీరావు, ఏవో సునీల్, వీఏఏ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే సాధ్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి అన్నారు. మండలంలో యల్లాయపాలెం పంచాయతీ పరిధిలో రామాపురం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఫెన్సింగ్‌ను పరిశీలించారు. అనంతరం బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ నియో జకవర్గంలో మారుమూల గ్రామాలను సైతం పట్టణాలుగా తీర్చిదిద్దుతామన్నారు. యల్లా యపాలెం పంచాయతీని రూ. కోటి ఇరవై లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. రామాపురం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజుపాలెం గ్రామంలో జీఎస్టీ తగ్గింపుపై దుకాణదారులను కలిసి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లునాయుడు, నాయకులు కేతు వెంకటరమణారెడ్డి, ఏకొల్లు వంశీరెడ్డి, కరకటి మల్లికార్జున, గరికపాటి రాజేంద్రకుమార్, చెక్క మదన్, బడుగు శ్రీనివాసులు, తువ్వర ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

- హెలీప్యాడ్ పరిశీలన

కోవూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. వెంకటాచలం మండల పరిధిలోని తాటిపర్తిపాళెం గ్రామ సముద్రతీరంలో పరిశ్రమకు సీఎం ప్రారంభోత్సవం చేయనున్నారు. కోవూరు సహకార చక్కెర ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు. సీఎం పర్యటన ఏర్పాట్లను డీఎస్పీ జీ శ్రీనివాసరావు ఎమ్మెల్యేకి వివరించారు. వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకరరెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, బెజవాడ జగదీష్, మోర్ల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'తో అక్షర వెలుగులు

రాపూరు, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులైన వయోజన మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యం తో ప్రభుత్వం ప్రత్యేకంగా 'ఉల్లాస్' పథకం ప్రవేశ పెట్టిందని రాపూరు మండలాభివృద్ధి అధికారిణి మారెళ్ల భవానీ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక వెలుగు కార్యాల యంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 1800 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 180 మంది విద్యా వాలంటీర్లను ఎంపిక చేసుకొని శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీవో భవాని గ్రామాలలో విద్యా వాలంటీర్లకు పుస్త కాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎం చంద్రశేఖర్, ఏట దశరథ రామి రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, అంగన్వాడీ సూప ర్‌వైజర్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కోటి సంతకాల సేకరణ

- మాజీ మంత్రి కాకాణి

ముత్తుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ముత్తుకూరు వైసీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నియోజక వర్గం నుంచి 60వేలకు పైగా సంతకాలు సేకరించి గవర్నర్‌కు పంపిస్తామన్నారు. వచ్చే నెల 11, 12 తేదీల్లో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. కల్తీ మద్యం విషయంలో తమ పాత్రపై సీబీఐ విచారణ చేసుకోవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గండవ రపు సుగుణ, వైసీపీ నాయకులు నెల్లూరు శివప్రసాద్, దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, తేజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి

రెచ్చగొట్టడానికే జగన్‌రెడ్డి రోడ్ షోలు

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రప్పా రప్పా అని రెచ్చ గొట్టడానికే రోడ్ షోలు చేస్తున్నాడని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి విమర్శించారు. సర్వేపల్లి గ్రామంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రోడ్ షోలు చేయడం, అమాయకులను బలి తీసుకోవడం అలవాటుగా మారిందని విమర్శించారు. రూ.500 కోట్లతో చేపట్టిన మెడికల్ కళాశాలకు వైసీపీ ప్రభుత్వంలో ఖర్చు పెట్టింది కేవలం రూ.10.70 కోట్లు మాత్రమేనని విమర్శించారు. మెడికల్ కళాశాలల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి ఇప్పుడు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలను తప్ప మిగిలిన అన్ని కళాశాలల నిర్మాణాలను జగన్‌రెడ్డి నిర్లక్ష్యం చేశాడని విమర్శించారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.3500 కోట్లతో కల్తీ మద్యం స్కాం చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి పద్ధతి మార్చుకుని నడుచుకుంటే మంచిదని హితవు పలికారు. కార్యక్రమంలో ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తదిత రులు పాల్గొన్నారు.


ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

- సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఈదగాలి గ్రామంలో నూతనంగా ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఇథనాల్ ఫ్యాక్టరీని సీఎం చంద్రబాబు శుక్రవారం ప్రారంభించనున్నారు. దీంతో గురువారం ఏర్పాట్లను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్వయంగా పరిశీలించి కంపెనీ ప్రతినిధులతో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం చంద్ర బాబు ఫ్యాక్టరీ ప్రారంభించడంతోపాటు నందగోకులం స్కూల్, గోశాలను సందర్శించనున్నారు. ఆయన వెంట సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేష్, ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, జిల్లా అధికారులు తదితరులున్నారు. అడిషనల్ ఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలో హెలిపాడ్ నుంచి ఫ్యాక్టరీ వరకు ప్రత్యేక కాన్వాయ్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. అడుగడు గున పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల భద్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

బోధనేతర పనుల బహిష్కరణ

విడవలూరు, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఎఫ్ఏపీటీవో) మండల నాయకులు తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక ఎంఈవో2 వెంకటేశ్వర్లు రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తలపెట్టిన బోధనేతర కార్యక్రమాల వలన బోధన సమయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ నాయకులు చెంచురామయ్య, యుటీఎఫ్ నాయకులు విశ్వనాద్, మైపాటి శ్రీనివాసులు, బీటీఏ నాయకులు చెంచు కృష్ణయ్య, ఏపీటీ ఎఫ్ నాయకులు సురేంద్ర, ఆనందపాల్, మునీంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్లౌజులు, మాస్కులు ధరించాలి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి) క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు, కూలీలు తప్పని సరిగా గ్లౌజులు, మాస్కులు ధరించాలని బీఏఎస్ఎఫ్ సంస్థ రీజనల్ మేనేజరు రాజేష్ సూచించారు. గురువారం బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సంస్థ సిబ్బంది యగ్నిత, సందాని, వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి 'గోల్డెన్ పీకాక్' అవార్డు

ముత్తుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్, 2025 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మకమైన 'గోల్డెన్ పీకాక్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్' విజేతగా నిలిచింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ప్రకటించిన ఈ అవార్డు కార్పొరేట్ పాలనలో అత్యున్నత ప్రమాణాలను నిలబెట్టడానికి ముత్తుకూరులోని పైనంపురంలో గల ఎస్ఈఐఎల్ ఎనర్జీ నిబద్ధతను గుర్తిస్తుంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ స్థాపించిన గోల్డెన్ పీకాక్ అవార్డులు, కార్పొరేట్ పాలన, స్థిరత్వం, వ్యాపార పనితీరులో అత్యుత్తమతకు ఒక ప్రమాణం. ఈ అవార్డు ఎస్ఈఐఎల్ ఎనర్జీ విశ్వసనీయత, పారదర్శకత, వాటాదారుల విలువ కోసం నిరంతరాయంగా కృషి చేయడానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ప్లాంట్‌లో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జనమేజయ మహాపాత్ర మాట్లాడుతూ పారదర్శకత, జవాబుదారీతనం, బాధ్యతాయుతమైన వ్యాపార పద్ధతుల పట్ల అంకితభావాన్ని గుర్తించే ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకోవడం తమకు గౌరవంగా ఉందన్నారు. ఈ అవార్డును నవంబరు 4న లండన్‌లో జరిగే ఐవోడీ ఇండియా2025 వార్షిక గ్లోబల్ కన్వెన్షన్ ఆన్ కార్పొరేట్ గవర్నెన్స్ అండ్ సస్టైనబిలిటీలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జనమేజయ మహాపాత్రకు ప్రదానం చేయనున్నారు.


జనమేజయ మహాపాత్ర



రోడ్డు ప్రమాదంలో ఉద్యాన విస్తరణ అధికారి మృతి

నెల్లూరు(క్రైం) అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై సౌత్‌రాజుపాళెం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉద్యానవన శాఖ విస్తరణ అధికారిణి ఒకరు మృతిచెందారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని నవాబు పేట కృష్ణానగర్‌లో డీ ప్రియాంక(34), బాలవిశ్వనాథ్ దంప తులు నివసిస్తున్నారు. ప్రియాంక కోవూరులో ఉద్యానవన విస్తరణ అధికారిణిగా పనిచేస్తుండగా ఆమె భర్త కూడా అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం ఆమె వేదాయపాలెంలోని ఆ శాఖ జిల్లా కార్యాలయానికి వెళ్లేందుకు స్కూటీపై జాతీయ రహదారి మీదుగా బయలుదేరారు. సౌత్‌రాజుపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి మినీ ట్రక్కు స్కూటీని వేగంగా ఢీకొంది. గాయాలపాలైన ఆమెను స్థానికులు సమీపంలోని మెడికవర్ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. వైద్యశాలలోని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రియాంక ఆరు నెలలు ప్రసూతి సెలవులో ఉండి ఒక పాపకు జన్మనిచ్చింది. 10 రోజుల క్రితమే తిరి గి విధుల్లో చేరింది. ఇంతలో ఇలా జరగడం అందరినీ బాధించింది.


ప్రియాంక (ఫైల్)

పిడుగుపాటుకు వ్యాపారవేత్త...

చేజర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో కాకినాడలో వ్యాపారవేత్తగా రాణిస్తూ వ్యవసాయం మీద మక్కువతో చేజర్ల మండలంలోని చేజర్ల కండ్రిక సమీపంలో పొలం తీసుకుని పనులు చేయిస్తుండగా పిడుగుపాటుకు గురై ఓ వ్యాపారవేత్త మృతిచెందిన సంఘటన స్థానికులను కలచివేసింది. పూర్తి వివరాల మేరకు... కాకినాడ పట్టణంలో బిల్డర్‌గా కాంట్రాక్టర్‌గా రాణిస్తున్న కొవ్వూరు వెంకటరామకృష్ణారెడ్డి (60) వ్యవసాయం చేయాలన్న ఉద్దేశంతో చేజర్ల సమీపంలో గత కొంతకాలం క్రితం పొలాన్ని తీసుకున్నాడు. గత రెండు నెలల నుంచి అక్కడే ఉంటూ పొలంలో రోడ్లు, తదితర పనులు చేయిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం కూలీల చేత పనులు చేయిస్తుండగా ఒక్కసారిగా మారిన వాతావరణంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, మృతుడు వెంకటరామకృష్ణారెడ్డి చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో మమేకమై అందరితో కలిసిపోయేవాడని, ఇంతలోనే ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నెలూరుకు బయలుదేరినట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటరామకృష్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైలు ఢీకొని ఒకరు...

నెల్లూరు(క్రైం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలను గురువారం 55 ఉంచి 60 ఏళ్ల వ్యక్తి దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో అక్కడి కక్కడే మృతిచెందాడు. మృతదేహంపై గోధుమరంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపురంగు ప్యాంటు ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చు రీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

ముత్తుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలి లా ఉన్నాయి. ఈపూరు కూడలిలో ఓదుకాణంలో కూర్చుని ఉన్న రమణయ్యను బుధవారం రాత్రి ఆటో వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొనడంతో శివారెడ్డి రమణయ్య (55) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రమణయ్య గురువారం మృతి చెందడంతో ముత్తుకూరు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు బైకు ఢీకొని ఒకరికి గాయాలు

కలిగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న మోటారు బైకును, మద్యం మత్తులో వెనుకనుండి మరో వ్యక్తి బైకుతో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన గురువారం పట్టణంలోని సాయిబాబా మందిరం వద్ద చోటుచేసుకుంది. మండలంలోని వీరారెడ్డిపాలెంకు చెందిన నర్రావుల అంకిరెడ్డి కలిగిరినుండి స్వ గ్రామానికి వెళుతుండగా వెనుక నుండి మల్లి అనే వ్యక్తి బైకుతో ఢీ కొట్టాడు. దీంతో గాయపడిన అంకిరెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. స్థానికుడైన మల్లి మద్యం మత్తులో ఘటనా స్థలంలో అనుచితంగా ప్రవర్తించడంతో స్థాని కులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు.

కారు, ఆర్టీసీ బస్సు ఢీ

సీతారామపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎల్‌విఆర్ కాలేజ్ సమీపంలోని ప్రధాన హైవే కూడలి వద్ద గురువారం ఉదయం కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. స్థానికుల వివరాల మేరకు... బస్సు ఉదయగిరి వైపు నుంచి సీతారామపురం వెళ్తుండగా, పోరుమామిళ్ళ హైవే క్యాంప్ ఆఫీస్ నుంచి సీతారామపురం చిన్ననాగంపల్లి వెళ్ళే క్రమంలో కారు రోడ్డు క్రాస్ చేస్తుండగా రెండూ ఢీకొన్నాయి. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై ఎస్ఐ శివకృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అడవుల తనిఖీ


అడవులను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

సీతారామపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పండ్రంగి బీట్ అటవీ ప్రాంతాన్ని గురువారం గుంటూరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. స్క్వాడ్ బృందం ఎఫ్ఆర్‌వో ఎస్‌వి సుబ్బారావు మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాపై అటవీ శాఖ సిబ్బంది డేగ కన్ను వేయాలన్నారు. బీట్ పరిధిలోని విలువైన అటవీ, వృక్ష సంపదను నిశితంగా పరిశీలించి, అటవీ సంపదని ఎవరైనా అక్రమంగా నరికి తరలిస్తున్నారనే అంశాలపై క్షుణ్ణంగా తనిఖీ చేపట్టి అడవుల సంరక్షణ పై సిబ్బందికి తగు సూచనలు సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కెవి ప్రసాద్, ఎఫ్ఎస్ఓ అశోక్, ఎఫ్‌బీఓలు గౌతమ్, సాయి, ప్రసాద్, రమణ, స్క్వాడ్ బృందసభ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 540

బాకీ చెల్లించకుంటే తాళం వేస్తాం...!

నగరంలో కార్పొరేషన్‌కు చెందిన దుకాణాల అద్దె బకాయిలు చెల్లించకుంటే ఆయా దుకాణాలకు తాళం వేస్తామని ఎన్‌ఎంసీ రెవెన్యూ విభాగం హెచ్చరించింది. చిన్నబజారులోని ఏసీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో 2వ షాపు రూ.లక్ష, 11వ షాపు రూ.6.57 లక్షలు, 22వ షాపు రూ.72 వేలు, 30వ షాపు రూ.15 లక్షలు బాకీపడ్డాయి. ఈ మొత్తం చెల్లించాలని నోటీసులు జారీ చేసినా వారు స్పందించకపోవడంతో తుది చర్యల్లో భాగంగా గురువారం ఆ దుకాణాలకు తాళం వేశారు. కాగా, బ్రహ్మానందపురం, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో తాగునీటి కొళాయి పన్ను చెల్లించని వారి ఇళ్లకు కొళాయి కనెక్షన్ తొలగించారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)



న్యూస్ బాక్స్

'రౌడీమూకలకు రాజకీయ అండ'

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం మత్తులో తిరుగుతూ అమాయకులపై దాడులకు పాల్పడుతున్న రౌడీ మూకలకు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నాయని చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ ఓ ప్రకటనలో ఆరోపించారు. మత్తులో ద్విచక్ర వాహనాలపై హల్ చేస్తున్న వారిని, చేతుల్లో మారణాయుధాలు ఉన్న వారిని రాత్రి పెట్రోలింగ్ సమయాల్లో గుర్తించి స్టేషన్లకు తరలించిన వెంటనే రాజకీయ నాయకుల నుంచి ఫోన్లు రావడంతో వారిని వదిలేస్తున్నారని ఆరోపించారు. రెండు నెలల క్రితం అర్ధరాత్రి వేళ తనపై కూడా కొందరు దాడికి యత్నించారని చెప్పారు. నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రౌడీమూకల నుంచి ప్రజలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, ఆదిశగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై 12న వ్యాసరచన పోటీ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు ఈనెల 12వ తేదీన వ్యాసరచన పోటీ నిర్వహిస్తున్నట్లు 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు బాలాజీనగర్ వికాస్ హైస్కూల్‌లో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేస్తామని తెలిపారు.

12న యాదే కిషోర్‌కుమార్ మ్యూజికల్ నైట్



కిషోర్‌కుమార్ మ్యూజికల్ నైట్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జావీద్, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : హిందీ చిత్రసీమలో ప్రముఖ నేపథ్య గాయకుడు కిషోర్‌కుమార్ 38వ వర్ధంతి సందర్భంగా ఈనెల 12న మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయకుడు జావీద్ తెలిపారు. ఈ కార్యక్రమ పోస్టర్లను గురువారం టౌనుహాలులో ఆవిష్కరించారు. మ్యూజికల్ నైట్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు టౌనుహాలులో జరిగే ఈ కార్యక్రమానికి సంగీత ప్రియులు హాజరుకావాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొండాయపాలెం లోని అబైడింగ్ హోప్ ట్రస్ట్‌లో గురువారం పౌష్టికాహార పంపిణీ జరిగింది. సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్ రజిని అతిథిగా హాజరయ్యారు. అనారోగ్యంతో ఒత్తిడి, ఆందోళన చెందరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల్‌కుమార్, లెక్చరర్ స్వర్ణలత, ఏ జయప్రకాష్, సిస్టర్ రమా, సిస్టర్ జయ పాల్గొన్నారు.

సీజేపై దాడి యత్నం అమానుషం

● అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడం అమానుషమని, న్యాయ వ్యవస్థపైనే దాడి చేసినట్లని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య. నాయకుడు రామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్ర మం చేపట్టారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మూకలు సనాతన ధర్మం పరిరక్షణ పేరుతో అలజడి సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలానీ ఖాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లీలామోహన్, మహిళా సంఘం నగర అధ్యక్షురాలు వనజ, ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యద ర్శులు మస్తాన్ షరీఫ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రశాంతి భేటీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ హిమాన్షు శుక్లాను గురువారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు.



ఒత్తిడే.. ఒత్తిడి!



నేటి సమాజంలో ప్రతి రంగంలోనూ ఒత్తిడి ఎక్కువవుతోంది. దీని వల్ల ఎంతో మంది మానసిక కల్లోలానికి గురవుతున్నారు. జీవితంపై అభద్రతాభావం పెరిగిపోవడంతో మానసిక వ్యాధిగ్రస్థుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవడంతో చిన్న కుటుంబాలు మానసిక ఒత్తిడిని తట్టుకోలేక చిన్నచిన్న సంఘటనలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా రోజుకు సుమారు 10 వేల మంది వివిధ వ్యాధులతో ఆసుపత్రులకు వస్తుండగా ఇందులో 30 శాతం మంది మానసిక వ్యాధులతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జన్యుపరమైన కారణాలతో నాలుగు శాతం పిల్లలు మానసిక దివ్యాంగులు(బుద్ధి మాంద్యం)గా పుడుతున్నారు.

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : చదువు.. ఉద్యోగం.. వృత్తి.. వ్యాపారం.. అన్నింటా ఒకటే టెన్షన్. ఆధునిక జీవన విధానంలో మనిషి నిత్యం రకరకాల ఒత్తిళ్లకు గురవుతున్నాడు. యువత విషయానికి వస్తే ఉన్నత విద్య, ఉద్యోగం, వయసు పెరుగుతున్నా వివాహం కాకపోవడం వంటి కారణాలతో మానసిక ఆందోళన చెందుతున్నారు. కార్పొరేట్ విద్యా విధానం, చదువులో పోటీతత్వం, విపరీతమైన ఒత్తిడి యువతను అతలాకుతలం చేస్తున్నాయి. ఆ ఒత్తిడిని జయించలేక కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో యువతకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మేధావులు, వైద్య నిపుణులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఈ విషయంలో చొరవ చూపి యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కాగా, సానుకూల దృక్పథం, వాస్తవాలను అర్థం చేసుకోవడం, వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటితో ఒత్తిడిని అధిగమించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

జిల్లాలో శిక్షణ కేంద్రాలు

జిల్లాలో మానసిక దివ్యాంగులు (బుద్ధి మాంద్యం) గల వారికి పలు శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. ప్రత్యేకించి నెల్లూరు నగరంలో రెడ్‌క్రాస్ మాగుంట సుబ్బరామిరెడ్డి స్పాస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన వారికి విద్యావిధానంపై శిక్షణ ఇస్తున్నారు. బాల్యం నుంచే పలు వస్తువులను గుర్తించి మాట్లాడేలా స్పీచ్ థెరపీ కూడా ఇస్తున్నారు. వృత్తి విద్యాకోర్సుల్లో కూడా తర్ఫీదునిస్తున్నారు. చిత్రలేఖనం, మ్యూజిక్ థెరపి వంటి ప్రత్యేక శిక్షణ ద్వారా వ్యాధిగ్రస్తులలో మార్పునకు ప్రయత్నిస్తున్నారు. నగరంలోని ప్రగతీ చారిటీస్, గౌతమి సంస్థలు కూడా మానసిక దివ్యాంగుల కోసం పనిచేస్తున్నాయి. కోవూరులోని ఎస్కార్ట్ సంస్థ, నగరంలోని వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ మానసిక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాయి.

నేడు మానసిక ఆరోగ్య అవగాహన ర్యాలీ

నెల్లూరు(విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సీహెచ్ రమేష్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమాజాన్ని చైతన్య పరిచే ఉద్దేశంతో యోగా మిత్రమండలి, ప్రణవ యోగా సెంటర్, లయన్స్ క్లబ్, మైండ్ మ్యాటర్ కౌన్సెలింగ్, గీతావైభవ్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఉదయం 6 గంటలకు నెల్లూరులోని గాంధీబొమ్మ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ, సాయంత్రం 5.30 గంటల నుంచి పురమందిరంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామ న్నారు. ప్రతీ ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

ఒత్తిడిని జయించేలా కృషిచేయాలి



ఒత్తిడిని జయించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి. ప్రస్తుత సమాజంలో మానసిక రుగ్మతలు ఎక్కువగా ఉన్నాయి. భయాలు, నిద్రలేమి, డిప్రెషన్, తీవ్ర కోపము, ఆందోళన, ఆత్మన్యూనత, ఆత్మహత్య ఆలోచన, ఇతర మనో రుగ్మతలతో ఎంతో మంది బాధపడుతున్నారు. చిన్న సమస్యలకే ఆత్మహత్యలకు దారితీస్తున్న సంఘ టనలు ఎన్నో ఉన్నాయి. మానసిక వ్యాధిగ్రస్తుల కు కౌన్సెలింగ్ ద్వారా ప్రత్యేక చికిత్స అవసరం. హిప్నో థెరపీ, సైకో థెరపీ, బిహేవియర్ థెరపీ, రిలాక్సేషన్ థెరపీతోపాటు ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత వంటి వాటిపై కౌన్సెలింగ్ ఇస్తున్నాము. ఎలాంటి మానసిక వ్యాధులు ఉన్నా నయం చేసే వైద్య విధానాలు జీజీహెచ్‌లో అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ లక్ష్మీప్రసూన,
జీజీహెచ్ మానసిక వైద్య నిపుణులు

ఎండు గంజాయి స్వాధీనం



ఎక్సైజ్ కార్యాలయంలో గంజాయి విక్రయదారులు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాల వద్ద గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితోపాటు అతనికి గంజాయి అమ్మిన వ్యక్తిని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ దయాసాగర్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం మీడియాకు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో నారాయణ వైద్య కళాశాల సమీపంలో గంజాయి విక్రయిస్తున్న కే రామును ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 700 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రామును తమదైన శైలిలో విచారించగా నారాయణ మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో ఉండే మానికాల దండు మారి అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు చెప్పాడు. దీంతో మారి నివాసంలో తనిఖీ చేయగా ఆరు కిలోల గంజాయి పట్టుబడింది. దానిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరినీ ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి విచారించారు. సూళ్లూరుపేటకు చెందిన ఎస్‌సీ ప్రసాద్ ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నట్లు, అతని వద్ద కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లుగా గంజాయిని మార్చి అమ్ముకుంటున్నట్లు అంగీకరించారు. నిందితులపై నెల్లూరు-1వ ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఏసీ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీ అనిత, సబ్‌ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ పూర్ణకుమార్, ఎస్‌డీ కాలేషావలి, హెడ్‌కానిస్టేబుళ్లు ఎన్ ప్రసాద్, ఏ రమేష్‌కుమార్, కానిస్టేబుళ్లు ఎన్ మునిరాజ్‌కుమార్, డీ గిరిబాబు, కే రమణయ్య పాల్గొన్నారు.

కోతుల గుంపు.. అడవికి తరలింపు



నగరంలోని యలమలవారిపాళెంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతుల గుంపును కార్పొరేషన్ ప్రత్యేక సిబ్బంది పట్టుకుని బద్వేలు సమీపంలోని అటవీ ప్రాంతానికి గురువారం తరలించారు. వానరాల బెడదతో అవస్థలు పడుతున్నామంటూ స్థానికులు మొరపెట్టుకోవడంతో కార్పొరేషన్ యంత్రాంగం కోతుల తరలింపునకు చర్యలు చేపట్టింది. కాగా, నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్, పాత మున్సిపల్ ఆఫీసు, ఫత్తేఖాన్‌పేట ప్రాంతాల్లో రోడ్లపై ప్రజలకు ఇబ్బందిగా మారిన పశువులను వాహనాల్లో ఎక్కించి కల్లూరుపల్లిలోని గోశాలకు తరలించినట్లు కార్పొరేషన్ పశువైద్యుడు మదన్‌మోహన్ తెలిపారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ తగ్గింపుతో ఔషధాల ధరలు తగ్గుదల

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డాక్టర్ సుధీర్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్ కుమార్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించటం వల్ల ఔషధాల ధరలు బాగా తగ్గాయని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్ కుమార్ వెల్లడించారు. జీఎస్టీపై జీజీహెచ్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ 36 అత్యవసర మందులపై ఉన్న 18 శాతం జీఎస్టీని పూర్తి రద్దు చేశారని, కొన్ని రకాల మందులపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారన్నారు. ఆక్సిజన్ సిలిండర్‌పై 12 శాతం జీఎస్టీని 5 శాతానికి కుదించారని వెల్లడించారు. పిల్లల పాల ఉత్పత్తులపై 12.5 శాతం ఉన్న జీఎస్టీని పూర్తిగా ఎత్తేశారని పేర్కొన్నారు. కంటి అద్దాలపై జీఎస్టీని కూడా 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, కృష్ణచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ ఢిల్లీ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా సుమంత్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(హరనాథపురం); అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : టీటీడీ బోర్డు ఢిల్లీ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా జిల్లాకు చెందిన ఏడుగుండ్ల సుమంత్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి, భక్తులకు మధ్యవర్తిగా వ్యవహరిస్తానని, తిరుమల ఔన్నత్యాన్ని పెంచేలా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఢిల్లీలోని శ్రీవారి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు. జిల్లాలోని విడవలూరు మండలానికి చెందిన సుమంత్‌రెడ్డి గతంలో నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్‌గా పనిచేశారు.

ప్రభుత్వ సంగీత పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

● ప్రిన్సిపాల్ మునికుమార్



సాయిబాబా మందిరంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత పాఠశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి కలిగిన వారు చేరవచ్చని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సీ మునికుమార్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలతో పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. గురువారం గాంధీబొమ్మ సెంటర్ గాంధీనగర్ షిరిడీసాయిబాబా మందిరంలో జరిగిన ప్రభుత్వ సంగీత పాఠశాల విద్యార్థుల భరతనాట్య ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని భరతనాట్య గురువు కే తిరుపతమ్మ పర్యవేక్షించారు. సంగీత, నృత్య విభాగాల అధ్యాపకులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

25 నాటికి త్రీఫేస్ కరెంట్ : శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్‌లోని గ్రామీణ ప్రాంతాలకు త్రీఫేస్ నాణ్యమైన విద్యుత్‌ను ఈ నెల 25 నాటికి అందించబోతున్నామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. చంద్రన్న వెలుగు పథకంలో భాగంగా త్రీ ఫేస్ కరెంట్ ఏర్పాటుకు రూ. 32 కోట్లను సీఎం చంద్రబాబు మంజూరు చేశారని వెల్లడించారు. ఇప్పటికే 97 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 3 శాతం పనులు 25వ తేదీలోపు పూర్తవుతాయని చెప్పారు.

వెంగళరావునగర్‌లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

నెల్లూరు సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 33వ డివిజన్ వెంగళరావు నగర్‌లో కార్పొరేషన్ ఆరోగ్య విభాగం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించింది. డ్రైనేజీ కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో స్థానిక ప్రజలు అవస్థ పడుతున్నందున అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ డ్రైవ్ ఏర్పాట్లు చేసినట్లు స్థానిక టీడీపీ ఇన్‌చార్జి కరణం హజరత్‌నాయుడు తెలిపారు. 15 మంది పారిశుధ్య కార్మికులతో కాలువల్లో పూడికతీసి మురుగు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేశారన్నారు.

నాణ్యమైన విత్తనాలే తయారు చేయాలి

● వ్యవసాయ అధికారులు

నెల్లూరు రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరి విత్తనాలు నాణ్యమైనవి తయారు చేయాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాము అన్నారు. కలెక్టర్ శుక్లా ఆదేశాల మేరకు గురువారం మండలంలోని పొట్టేపాళెం వద్దనున్న వర్షిత సీడ్స్ తయారీ ప్లాంటులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు కోవూరు ఏడీఏ అనిత, విజిలెన్స్ అధికారి వేణుగోపాలరావు, మండల ఏవో నాగమోహన్ తెలిపారు. వరి విత్తనాలు నాణ్యత ప్రమాణాల మేరకు తయారు చేయాలని స్పష్టం చేశారు. తయారీ, క్రయ, విక్రయాలన్నీ రికార్డుల్లో పక్కగా ఉండాలని సూచించారు. అనంతరం సౌత్ మోపూరులోని మహేశ్వరి సీడ్స్ తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడాన్ని నిరసిస్తూ నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం టీడీపీ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు పాలభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డేగ రవిరాఘవేంద్ర, కుడుముల సుబ్బారావు, అరవ కిషోర్, ఉయ్యాల జగన్, సురాబత్తిన రవీంద్ర, పలిగిలి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

5 లీటర్లకు 120 ఎంఎల్ స్వాహా!

● పెట్రోల్ బంకుల్లో మోసాలు ● తునికలు,కొలతల శాఖ దాడుల్లో బహిర్గతం



పొదలకూరు పెట్రోల్ బంకులో తనిఖీ చేస్తున్న అధికారులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పెట్రోల్, డీజిల్ బంకుల్లో భారీ మోసాలు జరుగుతున్నాయి. కొలతల్లో చేతి వాటం చూపి వినియోగదారులను మోసం చేస్తున్న విషయం మరోసారి వెలుగుచూసింది. పొదలకూరు కూడలిలోని దామోదర రావు పెట్రోల్ బంకులో తునికలు, కొలతల శాఖ జిల్లా అధికారి ఐసాక్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం తనిఖీ చేసింది. ఐదు లీటర్ల తూకపు గిన్నెలో పెట్రోల్ నింపగా 5.12గా రీడింగ్ చూపించింది. తద్వారా 5 లీటర్లకు 120 ఎంఎల్ పెట్రోల్ తక్కువగా పడుతున్నట్లు తేలింది. దీంతో ఆ బంకుపై కేసు నమోదు చేసినట్లు ఐసాక్ తెలిపారు. జిల్లాలోని పలు పెట్రోలు బంకుల్లోనూ ఇదే తరహా మోసాలు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. అలాంటి వాటిపై వాహనదారులు తమకు తెలియజేయాలని ఐసాక్ కోరారు.

పశువుల్లో వ్యాధులపై అజాగ్రత్తలొద్దు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీజన్లలో పశువులకు సోకే వ్యాధుల విషయంలో అజాగ్రత్తగా ఉండవద్దని పెంపకందారులకు పశువైద్యులు సూచించారు. గురువారం నెల్లూరు రూరల్‌లోని కందమూరు గ్రామంలో ఉచిత పశువైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు పలు రకాల పరీక్షలు నిర్వహించి, మందులు అందచేశారు. పశుసంవర్ధక శాఖ నెల్లూరు డివిజన్ ఏడీ డాక్టర్ నాగమణి, పాలీక్లినిక్ డీడీ డాక్టర్ సోమయ్య మాట్లాడుతూ ఎక్కువగా పశువుల్లో రిపీట్ బ్రీడింగ్ సమస్యలుంటాయని, వాటికి తగిన చికిత్సలు చేయించాలన్నారు. అనంతరం పశుపెంపకందా రులకు ఉచితంగా మినరల్ మిక్చర్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణమ్మ, పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యులు కే హరిబాబు, గంగాధర్, శివతేజ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో స్మార్ట్ బజార్!

● రూ. 8.04 కోట్లతో 200 దుకాణాల ఏర్పాటు



స్మార్ట్‌బజారులోని ఓ దుకాణంలో వస్తువులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (సిటీ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతికతతో స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని మైపాడు రోడ్డు వద్ద కంటైనర్ షాపులతో సిద్ధమైన ఈ బజారును ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితర అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. షాపులు పొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. రూ.8.04 కోట్లతో ఇక్కడ 200 దుకాణాలు ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేశామని, తొలివిడతగా 120 షాపులు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా నెల్లూరులో ఏర్పాటు చేసిన ఈ బజారును మరో ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

సీఎం పర్యాటనకు భారీ బందోబస్తు



బ్రీఫింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ అజిత వేజేండ్ల

నెల్లూరు (క్రైం) : సీఎం పర్యటన సందర్భంగా 1,250 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. గురువారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో ఎస్పీ బందోబస్తు మ్యాప్‌ను వివరిస్తూ బ్రీఫింగ్ ఇచ్చారు. అతిథులు, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అప్రమత్తంగా ఉండి బందోబస్త్ విజయవంతంగా చేయాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో బారికేడ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలు ఆపేలా చూడాలని ఆదేశించారు. ఎవరైనా అలసత్వం ప్రదర్శించినా, విధులకు గైర్హాజరయినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్రీఫింగ్‌లో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

'మాలేపాటి'కి తీవ్ర అస్వస్థత

- అమరావతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స
- హుటాహుటిన తరలిన కుటుంబసభ్యులు

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నేత మాలేపాటి సుబ్బానాయుడు గురువారం మధ్యాహ్నం తీవ్రఅస్వస్థతకు గురయ్యారు. అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో ఉదయం సీఎం చంద్రబాబు అధ్యక్షతన వ్యవసాయ అనుబంధ శాఖలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి నలతగా ఉండటంతో కొంత విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుందన్న భావనతో అమరావతిలోని తన నివాసంలో ఉండిపోయారు. అయితే, సాయంత్రానికి అస్వస్థతకు గురవడంతో వెంటనే సమీపంలో ఉన్న మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించగా, బ్రెయిన్‌స్ట్రోక్‌గా వైద్యులు నిర్ధారించారు. వెంటనే శస్త్రచికిత్స నిర్వహించారు. టీడీపీ అగ్రనేతలు కూడా విషయం తెలుసుకుని ఆసుపత్రి వర్గాలను అప్రమత్తం చేశారు. మాలేపాటి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయన కుటుంబసభ్యులు వెంటనే అమరావతికి తరలివెళ్లారు.

నాడు అధ్వానం... నేడు అద్భుతం!



నాడు పిచ్చి మొక్కలు, కరతుమ్మ చెట్లతో కాలువ దుస్థితి

- ఈదగాలి.. ఇడిమేపల్లి కాలువకు మోక్షం

వెంకటాచలం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదగాలి - ఇడిమేపల్లి పంట కాలువకు మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్ల నుంచి పిచ్చి మొక్కలు, కరతుమ్మ చెట్లతో నిండిపోయి పంట కాలువ అధ్వానంగా తయారైంది. దీంతో ఈదగాలి రెండో నెంబరు తూము నుంచి ఇడిమేపల్లి వరకు సుమారు 2.5 కిలోమీటర్ల వరకు ఈ కాలువనుండి సాగునీటి పారుదల కూడా సక్రమంగా ఉండేది కాదు. దీంతో సుమారు 500 ఎకరాల్లో వరి సాగు చేసుకోలేక రైతులు ఇబ్బందిపడ్డారు. దీంతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి కాలువ దుస్థితిని తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన కాలువ మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సకాలంలో నీరు అందాలన్న సంకల్పంతో కాలువ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు. వేగంగా పనులు జరుగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో మరమ్మతు పనులు పూర్తి కానున్నాయి. గత ఐదేళ్ల నుంచి మొన్నటిదాకా మొక్కలు, చెట్లతో పూడిపోయి కాలువ రూపే కనిపించని దుస్థితి. కానీ ఐదారేళ్ల తర్వాత కాలువ పనులకు మోక్షం కలగడంతో స్థానిక రైతుల పర్యవేక్షణలో పనులు చకచకా సాగుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు పూర్తయిన చోట కాలువ సుందరంగా కనిపిస్తోంది.


మరమ్మతు పనుల అనంతరం సుందరంగా మారిన కాలువ

శిశు కేంద్రాల్లో లోపాలు సరి చేసుకోవాలి

- జిల్లాస్థాయి పరిశీలన కమిటీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శిశు సంరక్షణ కేంద్రాల్లో లోపాలను వాటి యాజమాన్యాలు సరిచేసుకోవాలని జిల్లా స్థాయి పరిశీలన కమిటీ సూచించింది. ఆ కమిటీ సభ్యులు గురువారం నెల్లూరులో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశుగృహను, బాలసదన్‌ను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ వీబీ అనురాధ, జిల్లా ప్రొబేషన్ అధికారి ఫరూక్‌బాషా, జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మసక నేత్రం

జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాల మరమ్మతులు

- అంధకారంలో మ్యాట్రిక్స్ కెమెరాలు
- ప్రైవేటు వాటిపై ఆధారపడిన పోలీసులు
- కేసుల ఛేదనలో జాప్యం


నెల్లూరు నగరంలోని పాత చెక్‌పోస్టు వద్ద...


నెల్లూరు : శెట్టిగుంట రోడ్డు కూడలిలో...



ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు(క్రైం) అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 534పైగా మ్యాట్రిక్స్ కెమెరాలు ఉన్నాయి. వీటిని జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అటాచ్ చేసుంటారు. ఆయా ప్రాంతాల్లో నేరాలు జరిగినప్పుడు సంబంధిత పోలీసు సిబ్బంది కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తారు. గత ప్రభుత్వ హయాంలో నెల్లూరుతోపాటు పలు ప్రాంతాల్లో ఇవి దిష్టిబొమ్మల్లా మారాయి. కూటమి ప్రభుత్వంలోనూ వీటిపై ప్రత్యేక దృష్టి సారించలేదు. దీంతో ఎన్నో కేసుల్లో దర్యాప్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇవే కాకుండా గతంలో వ్యాపారులు, కళాశాల యాజమాన్యాలు, అపార్ట్‌మెంట్‌లు, దాతల సాయంతో ఆయా ప్రాంతాల్లోని దుకాణాలు, కళాశాలలు, శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి ఫుటేజ్‌లు కావాలంటే అవి ఏర్పాటు చేసిన ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. పెన్‌డ్రైవ్‌లో పోలీసులు కాపీ చేసుకొని నేరాల ఛేదనకు కృషి చేసేవారు. అవి కూడా తక్కువ క్వాలిటీ, తక్కువ మెమరీ కలిగి ఉండటంతో కేసుల విచారణ జాప్యం జరుగుతోంది.


జలదంకి : చామదల వద్ద...

పట్టణంలో కన్నా.. పల్లెల్లోనే నయం

ఉదయగిరి : నేర నియంత్రణలో భాగంగా మండలంలో 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా గండిపాళెం, వెంగళరావునగర్, కొండాయపాళెం, కృష్ణంపల్లి, ఆర్లపడియ, పుల్లాయపల్లి, బండగానిపల్లి, దాసరిపల్లి, అయ్యవారిపల్లి తదితర పంచాయతీల్లో ఆలయాలు, ప్రధాన కూడళ్లు, ఉదయగిరిలోని ప్రధాన రహదారులు, సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పల్లెల్లో ఇవి పని చేస్తుండగా పట్టణంలో కొన్ని సక్రమంగా పని చేయడంలేదు.

- **ఆత్మకూరు:** పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి, వాటిని సీఐ కార్యాలయం కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేశారు. హనుమాన్ జంక్షన్, నెల్లూరుపాళెం, ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు, సోమశిల రోడ్డు సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్, మున్సిపల్ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, బజారువీధి, బట్టేపాడు రోడ్డు తదితర 52 చోట్ల వీటిని ఏర్పాటుచేశారు. ఇవి శాంతి భద్రతల పరిరక్షణకు ఉపయుక్తంగా ఉన్నాయి.

- **లింగసముద్రం :** బస్టాండ్ సెంటర్, శ్రీతిరుమణిశెట్టి కోటయ్యస్వామి మందిరం వద్ద, వెంగళాపురం బస్టాండ్ సెంటర్, తాతాహోటల్ సెంటర్, మొగిలిచెర్ల బస్టాండ్ సెంటర్‌తోపాటు గ్రామాల్లో నాలుగేళ్ల క్రితం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, ఇవి పనిచేయడం లేదు.

- **జలదంకి :** మండలంలోని 60ప్రాంతాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్‌కు అనుసంధానించారు. రోడ్డుప్రమాదాలకు పాల్పడి తప్పించుకు పోయేవారు నేరస్థులను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటనలు ఉన్నాయి.

- **కావలి :** గతంలో పట్టణంలో ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు రెండేళ్లుగా పనిచేయటంలేదు. దీంతో సీసీ కెమెరాలను అనుసంధానం చేసిన పోలీస్ కంట్రోల్ రూం నిరుపయోగంగా ఉంది. కావలిలోని ప్రధాన కేంద్రాల్లో పోలీసులు 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ నేర నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఇవి కొంత కాలం బాగానే పనిచేసినా రెండేళ్ల కిందట వచ్చిన తుఫాన్‌కు పనిచేయకుండా పోయాయి. ప్రస్తుతం పోలీసులు ప్రజలను చైతన్య పరచి ఒకటో పట్టణ పరిధిలో 164, రెండో పట్టణ పరిధిలో 100, రూరల్ పరిధిలో 100 సీసీ కెమెరాలు పెట్టించారు. కొన్ని సందర్భాల్లో ప్రైవేట్ వ్యక్తుల ఇళ్లలో ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయక నేరస్థులు దొరకడంలేదు.

కావలి : పోలీస్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఉన్న భవనం



- నెల్లూరు నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో గల ఓ మద్యం దుకాణంలో ఈనెలలో చోరీ జరిగింది. ఆ పోలీసుస్టేషన్ పరిధిలోని నవాబుపేట సెంటర్, మైపాడుగేటు, శెట్టిగుంటరోడ్డు, వారధి సెంటర్... ఇలా పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటి ఫుటేజ్‌లను పరిశీలిస్తే నిందితులను ఇట్టే పట్టేయవచ్చని పోలీసులు భావించారు. అయితే అవి పని చేయక పోవడంతో చేసేది లేక దుకాణాల ముందు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న కెమెరాల్లోని ఫుటేజ్‌లను పరిశీలించాల్సి వచ్చింది.

- నెల్లూరు పెన్నా బ్యారేజీకి సమీపంలోని తిక్కన పార్కు ఎదురుగా ఈనెల 6 అర్ధరాత్రి జంట హత్యలు జరిగాయి. సరిగ్గా సీసీ కెమెరాకు పక్కనే దాడి జరిగి, ఓ వ్యక్తిని కాలువలోకి తోసి హత్య చేయడం, మరో వ్యక్తిని రోడ్డుపై లాక్కుంటూ వెళ్లి కొద్ది దూరంలో ఉన్న జాఫర్ సాహెబ్ కాలువలో పడేసి హత్య చేశారు. సీసీ కెమెరా పక్కనే ఘటన జరిగింది కాబట్టి నేరస్థులను గుర్తించడం పెద్ద పని కాదనుకున్నారు పోలీసులు. తీరా చూస్తే ఆ కెమెరా పనిచేయలేదు. ఉదాహరణకు ఇవి రెండు సంఘటనలు మాత్రమే. వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి.

వింజమూరు ఎంపీపీపై అవిశ్వాసం పెట్టండి

కావలి ఆర్డీవోకు 8 మంది ఎంపీటీసీల లిఖితపూర్వక ఫిర్యాదు


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వింజమూరు మండలపరిషత్ అధ్యక్షుడు మోహన్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని 8 మంది ఎంపీటీసీలు లిఖితపూర్వకంగా కావలి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గురువారం 8 మంది ఎంపీటీసీలు వింజమూరు నాయకులతో కలిసి కావలి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు ఫిర్యాదు చేశారు. ఎంపీపీ గత నాలుగు సంవత్సరాలుగా మండల సమావేశాలు నిర్వహించడం లేదని, అభివృద్ధి నిధులు సక్రమంగా వినియోగించడంలేదని వారు ఆరోపించారు. దీంతో మండలాభివృద్ధి కుంటుపడిందని, ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టి, విధుల నుంచి తొలగించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీవో త్వరలో ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయాధికారి

నెల్లూరు (లీగల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని లోక్ అదాలత్ భవన్‌లో గురువారం 110 మంది పారా లీగల్ వలంటీర్లకు న్యాయాధికారులు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే వాణి తదితరులు పాల్గొన్నారు.

కొత్త టీచర్లు వచ్చేస్తున్నారు!

- వెబ్, మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రారంభం
- 13న విధుల్లోకి ఉపాధ్యాయులు



నెల్లూరు(విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే మెగా డీఎస్సీ నిర్వహించి, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 651 పోస్టులను భర్తీ చేయనున్నది. డీఎస్సీలో అర్హత సాధించి, ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈనెల 3 నుంచి 10 వరకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ పూర్తయ్యేలోపే పాఠశాలల ఎంపికకు అవకాశం కల్పించారు. ఈనెల 13న విధుల్లో చేరేలా పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

- **1:1 పద్ధతిలో ఖాళీలు**

టీచర్లు పాఠశాలలను ఎంపిక చేసుకునేందుకు 1:1 పద్ధతిలో ఖాళీలను చూపుతున్నారు. గురువారం నుంచి పాఠశాలల ఎంపికకు సంబంధించి వెబ్, మాన్యువల్ కౌన్సెలింగ్‌లకు అవకాశం కల్పించారు. జిల్లాలో 673 పోస్టులను భర్తీ చేసేందుకు ఖాళీలను ప్రకటించగా, వీటిలో ఐదు పోస్టులను ట్రైబల్ వెల్ఫేర్‌కు కేటాయించారు. మిగిలిన 668 పోస్టులకు ఎంపికయిన అభ్యర్థులకు అన్నీ పరిశీలనలను పూర్తిచేసి, 651 పోస్టులను భర్తీ చేస్తూ నియామక ఉత్తర్వులను అందచేయనున్నారు. మిగలిన 17 పోస్టులకు సంబంధించి వివిధ కారణాలతో తాత్కాలికంగా బ్రేక్ వేసినట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయులకు ఈనెల 3 నుంచి 10 వరకు ఇండక్షన్ శిక్షణను జిల్లాస్థాయిలో రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ, తెలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్, సోషల్ సబ్జెక్టుల అభ్యర్థులతో పాటు ఎస్‌జీటీ, ఎస్‌జీటీ ఉర్దూ మీడియం అభ్యర్థులు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోనూ, స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ టీచర్లు గొలగమూడిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కళాశాలలోనూ శిక్షణ ఇస్తున్నారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పించగా, ఎస్‌జీటీలకు యూనివర్సిటీ ప్రాంగణంలోనే మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. మండల పరిషత్ పరిధిలో 85 మంది, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 13 మంది, మునిసిపాలిటీల్లో 9 మందికి స్కూళ్లను కేటాయించేందుకు మాన్యువల్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. మిగిలిన అభ్యర్థులందరికీ కూడా వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే పాఠశాలలను కేటాయింపులు నిర్వహించనున్నట్లు డీఈవో బాలాజీరావు తెలిపారు.

- **టీచర్లు లేని పాఠశాలలపై ప్రత్యేక దృష్టి**

జిల్లా విద్యాశాఖ లెక్కల ప్రకారం రాపూరు మండల పరిధిలోని 22 పాఠశాలల్లో అత్యధికంగా పోస్టులను భర్తీ చేయనున్నారు. అనంతరం మర్రిపాడులో 8, దక్కిలిలో 7, సైదాపురంలో 7, కొండాపురంలో 6, సూళ్లూరుపేటలో 6, వరికుంటపాడు, కోట, వాకాడు, దుత్తలూరు మండలాల్లో నాలుగు గ్రామాల్లోని పాఠశాలల చొప్పున పోస్టులు భర్తీ కానున్నాయి. మిగిలిన వారికి ఇతర మండలాల్లో నియామక ఉత్తర్వులు అందిస్తారు. ఆయా మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ముదింపు పరీక్షలకు ఏర్పాట్లు

- 13 నుంచి అన్నీ పాఠశాలల్లో నిర్వహణ

నెల్లూరు(విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్నీ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి రెండవ నిర్మాణాత్మక ముదింపు(ఎస్ఏఎంపీ-2) పరీక్షలను ఈనెల 13 నుంచి నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా అన్నీ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 5వతరగతి విద్యార్థులకు 3రోజులు, 6 నుంచి 10వతరగతి విద్యార్థులకు 4 రోజులపాటు పరీక్షలు నిర్వహించేలా టైంటేబుల్‌ను విడుదల చేశారు. 13న తెలుగు, గణితం, 14న హిందీ, సామాన్యశాస్త్రం, భౌతికశాస్త్రం, 15న ఇంగ్లిష్, సాంఘికశాస్త్రం, 16న సంస్కృతం, జీవశాస్త్రం పరీక్షలు నిర్వహిస్తామని డీఈవో బాలాజీరావు తెలిపారు. ఈ రాత పరీక్షలకు ప్రతి సబ్జెక్టుకు 35 మార్కులకు నిర్వహించడంతోపాటు ప్రతి సబ్జెక్టులో తరగతి గదిలో విద్యార్థి ప్రతిస్పందనలు, రాతపనులు, ప్రాజెక్ట్ పనులకు ఒక్కొక్కదానికి 5 మార్కులు చొప్పున మొత్తం 50 మార్కులు ముదింపు చేస్తామన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా రెండవ నిర్మాణాత్మక ముదింపు నుంచి సరైన స్థాయిలో విద్యాబోధన ముదింపును ప్రభుత్వ పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులందరికీ ఎఫ్ఏటూల్-2 కింద అనుసంధానం చేస్తామన్నారు. అలాగే జవాబులు రాసేందుకు ప్రతి సబ్జెక్టుకు అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లు అందించామన్నారు. విద్యార్థులు పరీక్ష రాసిన అనంతరం ఉపాధ్యాయులు జవాబులను మూల్యాంకనం చేసి, ఆ మార్కులను ముదింపు పుస్తకంలో ఇవ్వబడిన ఓఎంఆర్ షీట్‌లో నమోదు చేసి స్కాన్ చేయాలన్నారు. అనంతరం స్కాన్‌చేసిన దాన్ని లీప్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తే ఫలితాలను రాష్ట్ర స్థాయిలో ముదింపు చేసి ప్రస్తుత విద్యా ప్రమాణాల మీద, తదుపరి చర్యలపైన ఉపాధ్యాయులకు సూచనలు చేస్తారని డీఈవో తెలిపారు.

పింఛనుదారుల నుంచి దసరా మూమూళ్ల వసూలు

- ఎంపీడీవో విచారణ


దసరా మామూళ్లపై లబ్ధిదారులను విచారిస్తున్న ఎంపీడీవో శైలజ

కలువాయి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దసరా మామూళ్ల పేరుతో ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులు ఒకొక్కరి నుంచి రూ.100 నగదును ఓ ప్రభుత్వ ఉద్యోగి వసూలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఎంపీడీవో శైలజ విచారణ జరిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన కలువాయిలోని ముస్లీంపాళెంలో పింఛన్ల పంపిణీ బాధ్యతను స్థానిక పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే శ్రీనివాసులుకు అధికారులు అప్పగించారు. కాగా, అక్టోబరు నెలకు సంబంధించిన పింఛను నగదు లబ్ధిదారులకు పంపిణీ సమయంలో దసరా మూమూళ్ల పేరుతో శ్రీనివాసులు ఒకొక్కరి నుంచి రూ.100 తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఎంపీడీవో విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దసరా మామూళ్ల వసూళ్లపై తాను లబ్ధిదారులను విచారించగా నగదు వసూలు చేసింది వాస్తవమేనని వారు తెలిపినట్లు ఆమె చెప్పారు. పింఛనుదారుల నుంచి నగదు వసూలు చేసిన ఉద్యోగిపై తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు విచారణ నివేదిక పంపుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

వీధి వ్యాపారుల కోసం 'పీఎం స్వనిధి'

- పథకంపై అవగాహనకు లోక్ కల్యాణ్ మేళాలు
- రూ.10 వేల నుంచి రూ. 15వేలకు పెరిగిన రుణం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు బతకలేనిస్థితిలో ఉన్న వీధి వ్యాపారులు ఉండే వారు. ఉన్నంతలో పండ్లు, కూరగాయలు కొనుగోలు చేసి వాటిని అమ్మి, వచ్చే సంపాదనతో జీవనం గడిపేవారు. వారి కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పథకాన్ని ప్రవేశపెట్టి, అండగా నిలబడటతో వారు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఈ పథకం కింద ప్రారంభంలో రూ.10వేలు ఇస్తున్న రుణాన్ని, రూ.15వేలకు పెంచింది. గతంలో మొదటి విడతలోరూ.10వేలు, రెండో విడత రూ.15వేలు, చివరగా రూ.50వేల రుణాలను ఈ పథకం కింద ఇచ్చారు. ప్రస్తుతం తొలి విడతలోరూ.15వేలు, రెండో విడత రూ.25వేలు, చివరిగా రూ.50 వేల రుణాన్ని ఇవ్వాలని నిర్ణయిచారు. వీధి వ్యాపారులకు రుణ మొత్తాలు పెరగటంతో వారు ఆనందంలో ఉన్నారు. ఆదేళ్ల కింద వీధి వ్యాపారులు గుర్తించి గుర్తింపు కార్డులు అందించారు. వీరికి బ్యాంకుల నుంచి స్వల్పకాలిక రుణాలు ఇస్తున్నారు. తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్నవారికి అదనంగా రుణాలు అందచేస్తున్నారు.

లోక కల్యాణ్‌మేళా నిర్వహణ

పీఎం స్వనిధి పథకంలో భాగంగా లోకకల్యాణ్ మేళాలను నిర్వహించారు. నెల్లూరు, కావలి, కందుకూరు, బుచ్చి, ఆత్మకూరులలో ఈ మేళాలు నిర్వహించి వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం గురించి తెలియచేశారు. పీఎం స్వనిధి కింద పెంచిన రుణ మొత్తాలను వివరించారు. వీధి వ్యాపారుల నుంచి రుణ దరఖాస్తులు స్వీకరించారు. మెప్మా అధికారులు దరఖాస్తులను పరిశీలించి, గ్రౌండింగ్ పూర్తి చేసి బ్యాంకర్లకు పంపనున్నారు.


పండ్లు అమ్ముతున్న వీధి వ్యాపారి

18,976 మంది వీధివ్యాపారులు

జిల్లాలోని మున్సిపాలిటీల్లో 18,976 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. నెల్లూరులో 12,888 మంది, ఆత్మకూరు మున్సిపాలిటీలో 1,377 మంది, కందుకూరులో 1,068, కావలిలో 3,663 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. వీరికి తొలి విడతలో రూ.18.97 కోట్లు రుణాలను అందచేశారు. వారిలో 7027 మందికి రెండో విడతలో 14.05 కోట్లు అందచేశారు. మూడో విడతలో 877 మందికి 4.38కోట్ల రుణాలను అందచేవారు. రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన వారికి రూ. 25 వేలు, రూ.50వేలు అందచేయటం ఈ పథక విశేషం. కాగా డిజిటల్ చెల్లింపులకే ప్రజలు ఎక్కువగా మక్కువ చూపటంతో, వీధి వ్యాపారులకు డిజిటల్ చెల్లింపులపై శిక్షణ ఇప్పిస్తున్నారు.

వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా

వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం ఓ ఆర్థిక భరోసా, ఈ పథకం వీధి వ్యాపారులందరికి వర్తించేలా వారిని గుర్తిస్తున్నాం. గుర్తింపు కార్డులను అందచేస్తున్నాం. వారికి పెరిగిన రుణ మొత్తాలను వివరిస్తున్నాం. వారు ఆర్థికంగా నిలదొక్కుకోడానికి అన్నీ చర్యలు తీసుకుంటున్నాం.

- లీలారాణి, మెప్మా పీడీ



డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 922 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 713 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 209 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 315 కాగా, కనిష్ఠ ధర రూ. 70 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11738
వెండి కిలో ధర	రూ. 163000
వెండి ఒక గ్రాము	రూ. 167.00

పని చేయకుంటే పైసా దక్కదు!

ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ

బినామీ మస్టర్లకు చెక్

ఉదయగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ప్రతి శ్రామికుడి ఫొటోతో ఈకేవైసీ చేసి పనులకు హాజరయ్యే వారికే వేతనం అందించనున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న క్షేత్ర సహాయకుడు లేదా మేటీల సెల్‌ఫోన్‌లో ఉన్న యాప్‌లో ఈకేవైసీ ఆఫ్ వర్కర్స్ అనే ఆప్షన్ ఇచ్చారు. అందులో ప్రతి శ్రామికుడు ఈకేవైసీ చేయాల్సి ఉంటుంది. జాబ్‌కార్డు కలిగి పనుల్లో పాల్గొంటున్న శ్రామికుల వద్దకు క్షేత్ర సహాయకుడు వెళ్లి జాబ్, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేయాలి. ఆ వివరాలు సెల్‌ఫోన్‌లో ప్రత్యక్షమైన తరువాత యాప్ నుంచి ఫొటో తీసుకోవాలి. ఆ ఫొటోతో


ఉదయగిరిలో ఈకేవైసీ నమోదు చేస్తున్న క్షేత్ర సహాయకుడు

జాబ్‌కార్డు, ఆధార్‌లు అనుసంధానమైతేనే ఈకేవైసీ ప్రక్రియ పూర్తవుతుంది. తద్వారా పని ప్రదేశంలో కూలీల హాజరు నమోదు పక్కాగా ఉంటుంది. జిల్లాలో 5,83,258 మంది ఉపాధి శ్రామికులు ఉండగా, 83,605 మందికి మాత్రమే ఈకేవైసీ పూర్తయ్యింది.

బినామీ మస్టర్లకు చెక్

ముఖ ఆధారిత హాజరు రోజుకు రెండుసార్లు వేసే విధానాన్ని నూతనంగా అమల్లోకి తెచ్చారు. దీంతో ఒకరి బదులు మరొకరు ఫొటోలు దిగి పని చేయకుండా డబ్బులు తీసుకోవడం కుదరదు. దీనికి తోడు శ్రామికుల జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. ఈకేవైసీతో బినామీ శ్రామికులకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయనున్నారు. ఈనెల 15వ తేదీలోపు శ్రామికుల ఈకేవైసీ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు ఉపాధి హామీ పథకం అధికారులు తెలుపుతున్నారు.

న్యూస్ బాక్స్

అమరనాథ్ అలంకారంలో విశ్వేశ్వరస్వామి


అమరనాథ్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన విశ్వేశ్వరస్వామి

సంగం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగం తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో లోక కల్యాణార్థం చేస్తున్న 45 రోజుల లలితా రుద్ర మహాయజ్ఞంలో భాగంగా గురువారం కాశీవిశ్వేశ్వరస్వామి అమరనాథ్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచ సూక్త సహిత రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

ఘనంగా గంధ మహోత్సవం

ఉదయగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆస్థాన ఖాదరీయాలో హజరత్ గౌసులాజం దస్తగీర్ గ్యారవీ షరీఫ్ సందర్భంగా గురువారం గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా ఆస్థానకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆస్థాన ఖాదరీయా అధ్యక్షుడు అహ్మద్‌బాషా ఖాలిది, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, మతపెద్దలు మిరాయిగిరి అహ్మద్, ఫరుద్దీన్, ఉస్మాన్‌అలీ, నజీర్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు:** దుత్తలూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో మహబూబ్‌సుభానీ గంధ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు.

బంగారు కుటుంబానికి పక్కాగృహం మంజూరు


పక్కాగృహం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆర్డీవో పావని

ఆత్మకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో ఏళ్ల తరబడి తలదాచుకునేందుకు సరైన గూడు, ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్న జ్ఞానమ్మ కుటుంబానికి పీ-4 పథకంతో ఊరట లభించింది. ఆమెకు ప్రభుత్వం పక్కాగృహాన్ని మంజూరు చేసింది. గురువారం ఆత్మకూరు ఆర్డీవో బి పావని పక్కాగృహం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నేతలు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచల చౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, హౌసింగ్ ఈఈ మోహన్‌రావు, డీఈ కె రవి, ఏఈ శరత్ తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డు

వింజమూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర అవార్డుకు వింజమూరు పంచాయతీ ఎంపిక కావడం హర్షణీయమని సర్పంచ్ నల్లొండ సృజన, ఈవో రామారావు అన్నారు. ఈసందర్భంగా గురువారం పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ అవార్డు ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో అవార్డు అందుకున్నామని ఆమె తెలిపారు.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పోస్టర్ ఆవిష్కరణ


సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మండల తెలుగుదేశం పార్టీ నాయకులు

సీతారామపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు, మండల టీడీపీ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో మండల టిడిపి నాయకులు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పోస్టర్ ఆవిష్కరించారు. పేద, మధ్యతరగతి రైతులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నుంచి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రజల అభిప్రాయాలను మై టీడీపీ యాప్‌లో అప్లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సోమనబోయినరాజశేఖర్, మండల యూత్ కన్వీనర్ పసుపులేటి వికాస్‌బాబు(విక్కి), షేక్ బాబు, నేలటూరి జాషువా, సుమన్, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, జయరాములు, గౌస్ , చంద్ర, ఏడుకొండలు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఉదయగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాలాజీనగర్, షామీర్సావీధి, అంచెవారివీధుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఎంపీడీవో బీ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా పరిశీలించారు.

విద్యార్థుల తాగునీటి కోసం ఆర్థిక సహాయం

ఆత్మకూరు : పేరారెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కోసం ఎస్‌విపి ప్రజా వైద్యశాల ఎండి డాక్టర్ ప్రణీత్ గురువారం డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ తరఫున రూ.12,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **వృద్ధురాలికి వీల్‌చైర్ వితరణ**

ఉలవదిబ్బలో పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధురాలు టంగుటూరు హజరత్తమ్మకు టీడీపీ నాయకుడు చంద్రా వెంకట సుబ్బానాయుడు సాంబశివ చారిటబల్ ట్రస్టు చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి వీల్‌చైర్ అందజేశారు.

● **పెళ్లికానుక అందజేత**

ఉదయగిరి : దుంపవారిపల్లికి చెందిన కంచర్ల తిరుపతయ్య, లక్ష్మీదేవిల కుమార్తె వెంకటలావణ్య వివాహం సందర్భంగా కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం రూ.10 వేల సాయం అందజేశారు.

జాతీయ రహదారిపై బంకమట్టి తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రహదారిపై బంకమట్టిని తొలగిస్తున్న హైవే నిర్వాహకులు

సంగం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరమన క్రాస్ రోడ్డుకు సమీపంలో ముంబాయి జాతీయ రహదారిపై ఉన్న బంకమట్టిని హైవే నిర్వాహకులు గురువారం తొలగించారు. జాతీయ రహదారిపై బంకమట్టితో ప్రమాదం అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురించతమైంది. దీనికి స్పందించిన హైవే అధికారులు బంకమట్టిని తొలగించాలని హైవే ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. దీంతో వారు జాతీయ రహదారిపై ఉన్న బంకమట్టిని డోజర్‌తో తొలగించారు. అదేవిధంగా బీరాపేరు వంతెనపైన, కొండ వద్ద ఉన్న ఇసుక నిల్వ కేంద్రం వద్ద రోడ్డు మీద ఉన్న ఇసుకను తొలగించాలని ద్విచక్ర వాహనాదారులు కోరుతున్నారు.

సుప్రీంకోర్టు ఘటనపై కాంగ్రెస్ నేతల నిరసన

ఆత్మకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నాన్ని ఖండిస్తూ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నెం నాగరాజు ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ముందుగా మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కె తిరిపాలు, కె చలపతి, ఎస్‌డి రసూల్, సి కామేశ్వరి తదితరులు, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేసిన రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి అన్నారు. గురువారం మండలంలోని కాకొల్లువారిపల్లిలో కె రామ్మోహన్ అనే రైతు సాగు చేసిన మామిడి పంటను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో రాజ్‌కుమార్, ఏడీపీవో మునిరత్నం, ఏడీఏ నర్సోజీరావు, ఏవో సునీల్, వీపీఏ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యూరియా పంపిణీ

ఉదయగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొట్టాలపల్లి సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్లు సొసైటీ చైర్మన్ గడ్డం వెంకటసామయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సొసైటీకి 13 టన్నుల యూరియా వచ్చిందని, అవసరమైన రైతులు ఆధార్‌కార్డు, పొలం పాసుపుస్తకం తీసుకురావాలని ఆయన కోరారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ : ఫ్యాప్టో


సీతారామపురం: ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న మండల ఫ్యాప్టో నాయకులు

సీతారామపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర పనులు విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం వద్ద మండల ఫ్యాప్టో నాయకులు గురువారం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి మెమోరాండం అందించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎడమ తురుపతయ్య, భోగ్యం శ్రీనివాసులు, కలివెల రవిచంద్ర, పేరాల శ్రీనివాసులు, రామసుధాకర్, వెంకటేశ్వర్లు, ఓంకారం నరసింహారాజు, సుధాకర్‌రాజు, అంకబాబు పాల్గొన్నారు.

●**ఏఎస్ పేట:** బోధనకు ఆటంకం కలిగించే బోధనేతర పనులను శుక్రవారం నుంచి చేయలేమని ఏఎస్ పేట మండల ఉపాధ్యాయులు గురువారం ఎంఈవో కార్యలయంలో మెమొరాండం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ పేట మండల ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం


ఆత్మకూరు: వలంటీర్లకు అక్షరాభ్యాస పుస్తకాలను అందజేసిన ఎంపీడీవో రఫీఖాన్

ఆత్మకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అక్షర ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో పి రఫీఖాన్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వలంటీర్లకు అక్షరాభ్యాసానికి సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షర ఆంధ్ర కార్యక్రమం కింద ఆత్మకూరు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 890 మంది నిరక్ష్యరాసులను గుర్తించామని, ప్రతి పదిమంది నిరక్షరాస్యులకు ఒక వలంటీరును ఎంపిక చేశామన్నారు. పంచాయతీల్లో 89 భవనాలను ఎంపికచేసి ప్రతిరోజు సాయంత్రం 4గంటల నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం మండలంలో 89 అక్షరాస్యత కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** నిరక్షరాస్యులు అక్షర కేంద్రాలకు వచ్చి చదువుకోవాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. గురువారం స్థానిక అరుంధతీయవాడలో అక్షర కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యను అభ్యసించడం ద్వారా కలిగే ప్రయోజనాలు అభ్యాసకులకు వివరించారు. అభ్యాస కులను చేర్పించడంలో సహకరించిన కే నవీన్, ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్ పుట్టం ప్రవీణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో ప్రతిఒక్కరు పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని మండల అధ్యక్షులు చింతంరెడ్డి పద్మావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి మాట్లాడుతూ ఉపాధి హామి పథకం పనులు కల్పించి వలసలు నివారించాలన్నారు. మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని తెలిపారు. మూడునెలల కాలంలో వెలుగు, విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్, పారిశుధ్యం, హౌసింగ్ తది తర శాఖలలో జరిగిన అభివృద్ధి పనులపై సం బంధిత అధికారులతో ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ సమీక్షించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ రమణారెడ్డి, ఎంపీటీసీ పిసి అల్లూరు రాజు, ఎంఈవో మస్తాన్‌వలి, ఐసీడీఎస్ సూపర్వైజర్ షాను, సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, రామచంద్ర, హౌసింగ్ ఏఈ, పంచా యతీరాజ్ ఏఈ చిన్నయ్య, వ్యవసాయాధికారి చెన్నరెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటు : ఎంపీడీవో

సంగం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ నమోదు చేసుకోని షెడ్యూలు తెగల వారికి కొత్త ఆధార్ నమోదు, తిరస్కరించిన ఆధార్‌లను మరలా నమోదు చేసేందుకు ఈనెల 13వ తేదీ నుంచి 18వరకు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు ఎంపీడీవో షాలెట్ గురువారం తెలిపారు. ఈనెల 13, 18వ తేదీల్లో సంగం -1, 2, 3 సచివాలయాల పరిధిలోని షెడ్యూల్ తెగలవారికి సంగం -1 సచివాలయంలో ఆధార్ నమోదు చేయడం జరుగుతుంది. అదేవిధంగా 14న జండాదిబ్బ సచివాలయంలో దువ్వూరు, అన్నారెడ్డిపాళెం, జండాదిబ్బ గ్రామాల వారికి, 15న సిద్దీపురం, పడమటిపాళెం, తరుణవాయి సచివాలయాల పరిధిలోని వారికి సిద్దీపురంలో, 16న మర్రిపాడు సచివాలయంలో వంగల్లు, మర్రిపాడు గ్రామాల వారికి, 17న కొరిమెర్ల సచివాలయంలో పెరమన, కొరిమెర్ల గ్రామాల వారు ఆధార్ నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఈవిషయాన్ని గ్రామాల్లో ముందుగా టాంటాం వేసి ఆధార్ లేని వారికి నిర్దేశిత ధ్రువీకరణ పత్రములు సిద్ధం చేసి ఆధార్ నమోదుచేసే బాధ్యత వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

పేదల ఇంటి నివేశన స్థలాల పట్టాలు పరిశీలన

ఉదయగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి పంచాయతీలో పేదలకు పంపిణీ చేసిన ఇంటి నివేశన స్థలాల పట్టాలను గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పఠాన్ అబ్బాస్‌ఖాన్ పరిశీలించారు. వివరాల మేరకు.. గ్రామానికి వెళ్లే రహదారి పక్కన గల 1190, 1191 సర్వేనెంబర్లలో 1987, 88 సంవత్సరాల్లో 140 పేదలకు ఇంటి నివేశన స్థలాలు పంపిణీ చేశారు. అప్పటి నుంచి లబ్ధిదారులు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఇటీవల లేఅవుట్‌కు పక్కనే జాతీయ రహదారి నిర్మాణం జరగడంతో ఎవరికి వారుగా బేస్‌మట్టాలు నిర్మించారు. ప్రభుత్వం గ్రామానికి రూ.42 లక్షలతో కమ్యూనిటీ, రూ.30 లక్షలతో పంచాయతీ భవనాలను మంజూరు చేసింది. అయితే వాటి నిర్మాణానికి స్థలం లేకపోవడంతో ఇటీవల ఉదయగిరిలో నిర్వహించిన మెగా గ్రీవెన్స్‌డేలో గ్రామస్థులు ఆత్మకూరు ఆర్డీవో పావనికి వినతి పత్రం అందజేశారు. ఆమె ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు లేఅవుట్‌లో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారుల వివరాలను పరిశీలించడంతోపాటు పట్టాలు లేకుండా ఎవరైనా స్థలాలను ఆక్రమించి బేస్‌మట్టాలు కట్టారా అనే కోణంలో విచారణ చేపట్టారు. విచారణలో గుర్తించిన అంశాలను ఉన్నతాధికారులకు అందజేసి ఖాళీ స్థలం ఉంటే భవన నిర్మాణాలకు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

రోడ్డు ప్రమాదంలో ఉద్యాన విస్తరణ అధికారి మృతి


ప్రియాంక (ఫైల్)

నెల్లూరు(క్రైం) అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై సౌత్‌రాజుపాళెం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉద్యానవన శాఖ విస్తరణ అధికారిణి ఒకరు మృతిచెందారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని నవాబు పేట కృష్ణానగర్‌లో డీ ప్రియాంక(34), బాలవిశ్వనాథ్ దంపతులు నివసిస్తున్నారు. ప్రియాంక కోవూరులో ఉద్యానవన విస్తరణ అధికారిణిగా పనిచేస్తుండగా ఆమె భర్త కూడా అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం ఆమె వేదాయపాలెంలోని ఆ శాఖ జిల్లా కార్యాలయానికి వెళ్లేందుకు స్కూటీపై జాతీయ రహదారి మీదుగా బయలుదేరారు. సౌత్‌రాజుపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి మినీ ట్రక్కు స్కూటీని వేగంగా ఢీకొంది. గాయాలపాలైన ఆమెను స్థానికులు సమీపంలోని మెడికవర్ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. వైద్యశాలలోని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రియాంక ఆరు నెలలు ప్రసూతి సెలవులో ఉండి ఒక పాపకు జన్మనిచ్చింది. 10 రోజుల క్రితమే తిరిగి విధుల్లో చేరింది. ఇంతలో ఇలా జరగడం అందరినీ బాధించింది.

పిడుగుపాటుకు వ్యాపారవేత్త..

చేజర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో కాకినాడలో వ్యాపారవేత్తగా రాణిస్తూ వ్యవసాయం మీద మక్కువతో చేజర్ల మండలంలోని చేజర్ల కండ్రిక సమీపంలో పొలం తీసుకుని పనులు చేయిస్తుండగా పిడుగుపాటుకు గురై ఓ వ్యాపారవేత్త మృతిచెందిన సంఘటన స్థానికులను కలచివేసింది, పూర్తి వివరాల మేరకు... కాకినాడ పట్టణంలో బిల్డర్‌గా కాంట్రాక్టర్‌గా రాణిస్తున్న కొవ్వూరు వెంకటరామకృష్ణారెడ్డి (60) వ్యవసాయం చేయాలన్న ఉద్దేశంతో చేజర్ల సమీపంలో గత కొంతకాలం క్రితం పొలాన్ని తీసుకున్నాడు. గత రెండు నెలల నుంచి అక్కడే ఉంటూ పొలంలో రోడ్లు, తదితర పనులు చేయిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం కూలీల చేత పనులు చేయిస్తుండగా ఒక్కసారిగా మారిన వాతావరణంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, మృతుడు వెంకటరామకృష్ణారెడ్డి చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో మమేకమై అందరితో కలిసిపోయేవాడని, ఇంతలోనే ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నెలూరుకు బయలుదేరినట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటరామకృష్ణారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైలు ఢీకొని ఒకరు...

నెల్లూరు(క్రైం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలను గురువారం 55 ఉంచి 60 ఏళ్ల వ్యక్తి దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహంపై గోధుమరంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపురంగు ప్యాంటు ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

ముత్తుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన గురు వారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈపూరు కూడలిలో ఓదుకాణంలో కూర్చుని ఉన్న రమణయ్యను బుధవారం రాత్రి ఆటో వేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొనడంతో శివారెడ్డి రమణయ్య (55) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రమణయ్య గురువారం మృతి చెందడంతో ముత్తుకూరు ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు బైకు ఢీకొని ఒకరికి గాయాలు

కలిగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న మోటారు బైకును, మద్యం మత్తులో వెనుకనుండి మరో వ్యక్తి బైకుతో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన గురువారం పట్టణంలోని సాయిబాబా మందిరం వద్ద చోటుచేసుకుంది. మండలంలోని వీరారెడ్డిపాలెంకు చెందిన నర్రావుల అంకిరెడ్డి కలిగిరినుండి స్వగ్రామానికి వెళుతుండగా వెనుక నుండి మల్లి అనే వ్యక్తి బైకుతో ఢీకొట్టాడు. దీంతో గాయపడిన అంకిరెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. స్థానికుడైన మల్లి మద్యం మత్తులో ఘటనా స్థలంలో అనుచితంగా ప్రవర్తించడంతో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు.

కారు, ఆర్టీసీ బస్సు ఢీ


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

సీతారామపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎల్‌విఆర్ కాలేజ్ సమీపంలోని ప్రధాన హైవే కూడలి వద్ద గురువారం ఉదయం కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. స్థానికుల వివరాల మేరకు... బస్సు ఉదయగిరి వైపు నుంచి సీతారామపురం వెళ్తుండగా, పోరుమామిళ్ళ హైవే క్యాంప్ ఆఫీస్ నుంచి సీతారామపురం చిన్ననాగంపల్లి వెళ్ళే క్రమంలో కారు రోడ్డు క్రాస్ చేస్తుండగా రెండూ ఢీకొన్నాయి. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై ఎస్‌ఐ శివకృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అడవుల తనిఖీ


అడవులను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

సీతారామపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పండ్రంగి బీట్ అటవీ ప్రాంతాన్ని గురువారం గుంటూరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది.స్క్వాడ్ బృందం ఎఫ్‌ఆర్‌వో ఎస్‌వి సుబ్బారావు మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాపై అటవీశాఖ సిబ్బంది డేగ కన్ను వేయాలన్నారు. బీట్ పరిధిలోని విలువైన అటవీ, వృక్ష సంపదను నిశితంగా పరిశీలించి, అటవీ సంపదని ఎవరైనా అక్రమంగా నరికి తరలిస్తున్నారనే అంశాలపై క్షుణ్ణంగా తనిఖీ చేపట్టి అడవుల సంరక్షణ పై సిబ్బందికి తగు సూచనలు సలహాలను అందించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కెవి ప్రసాద్ , ఎఫ్ఎస్ఓ అశోక్ , ఎఫ్‌బిఓలు గౌతమ్ , సాయి, ప్రసాద్ ,రమణ , స్క్వాడ్ బృందసభ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 540

ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలి

లింగసముద్రం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని లింగసముద్రం, మొగిలిచెర్ల, వీఆర్ కోట, అన్నెబోయినపల్లి, చినపవని, పెదపవని, మేదరమెట్ల గ్రామాలలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాలలోని వయోజనులైన నిరక్షరాస్యులు ప్రతిరోజూ రాత్రి పూట గ్రామాలలోని పాఠశాలలకు వచ్చి చదువుకోవాలని కోరారు. వెలుగు శాఖకు చెందిన వీఓఏలు, ఉపాధిహామీ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను వాలంటీర్లుగా నియమించి వయోజనులకు చదువు చెప్పేలా శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎంవి శివకుమార్, ఏపిఎం కె సింహాద్రిరావు, ఏపీవో షేక్ సమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


అక్షర ఉల్లాస్ ప్రారంభం

పెద్దపవని రోడ్డు ఆర్వోబీ వంతెన నిర్మాణం హుళక్కేనా?

● పూర్తయితే పలు మండలాలకు రాకపోకలకు అవకాశం ● తీరనున్న ప్రజల కష్టాలు

కావలి (టౌన్) అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దపవని రోడ్డు 158 రైల్వే గేటు వద్ద నిర్మించతలపెట్టిన ఆర్వోబి వంతెన నిర్మాణం హుళక్కేనా? అని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావలి పట్టణం నుంచి అనేక మండలాలకు ప్రకాశం జిల్లాకు చెందిన అనేక మండలాల ప్రజల రాకపోకలకు పెద్దపవని రోడ్డు ప్రధాన మార్గంగా వుంది. కలుగోళ శాంభవి ఆలయం వద్ద రైల్వే గేట్ వద్ద నిరంతరం వాహనాలతో రద్దీ ఎక్కువడంతో 2010లో ఆర్వోబి వంతెన నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలకు రైల్వే శాఖ ఆర్అండ్‌బి ఆమోదం తెలపాయి. 2013 మార్చిలో ఆర్వోబి వంతెన నిర్మాణానికి 31.00 కోట్ల అంచనా వ్యయంతో శిలాఫలకం వేసారు. రైల్వే భాగస్వామ్యమైన రైలు పట్టాలపై ఆర్వోబి వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసింది. పట్టాలకు కిరువైపులా రాష్ట్రప్రభుత్వానికి చెందిన ఆర్‌అండ్‌బి శాఖ వారు చేపట్టాల్సిన వంతెన నిర్మాణ పనులు అంగుళం ముందుకు కదలక రైల్వే శాఖ కట్టిన వంతెన నిరుపయోగంగా మిగిలిపోవడమేకాక వెక్కిరిస్తున్నట్లుగా వుంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోయి టీడీపీ అధికారంలో రాక అనంతరం వైసీపీ తిరిగి టీడీపీ ప్రభుత్వాలు అధికారాల్లో వచ్చాయి. ప్రభుత్వాలు మారుతున్నాయేగాని ఆర్వోబి వంతెన నిర్మాణం మాత్రం ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేదు.


రైలు పట్టాలపై నిర్మించిన ఆర్వోబీ వంతెన


ఆర్వోబీ వంతెన నిర్మాణానికి 2013లో వేసిన శిలాఫలకం

ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీ కావు..

అందుబాటులో ఉన్న రైల్వే క్రాసింగ్ గేటు ఎత్తేయడం ఆర్వోబి వంతెన నిర్మాణం జరగక పోవడం రెంటికి చెడ్డ రేవడి అన్నవైనంగా మారి ప్రజలు రాకపోకలు సాగించేందుకు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద నీరు ప్రవహించేందుకు పక్కనే ఉన్న తూము మార్గాన ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తూ కాలం వెళ్ళదీస్తున్నారు. వర్షాలు పడినప్పుడు ఆమార్గంలో నీరు చేరి పూర్తిగా రాకపోకలు బంద్ చేసుకోవాల్సిన దుస్థితి.

అండర్ పాస్ నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేయాలి

ఆర్వోబీ వంతెన నిర్మాణానికి నిధుల లేమి, ఇతర కారణాలతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఆర్వోబీ వంతెన నిర్మాణం హుళక్కేనా? అన్న సందేహాలు నెలకొన్నాయి. సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారంగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చొరవ తీసుకుని రైల్వే అధికారులు ఆర్‌అండ్‌బి అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. త్వరలో అండర్ పాస్ బాక్స్ టైపు బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

రాళ్లపాడులో బయటపడ్డ మృతదేహం ఎవరిది?

● హత్యా.. ఆత్మహత్యా..? ● వీడని మిస్టరీ

లింగసముద్రం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో గత ఆదివారం రాత్రి బయటపడ్డ వ్యక్తి మృతదేహానికి సంబంధించిన వివరాలు ఇంకా పోలీసులకు లభ్యం కాలేదు. పోలీసులు ఈనెల 6న ఉదయం మృతదేహాన్ని ప్రాజెక్టులో నుంచి బయటకు తీసి కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో భద్రపరిచారు. మృతదేహం ఎవరిది, ఏ ప్రాంతానికి చెందినవాడో తెలుసుకునేందుకు అన్నీ పోలీస్‌స్టేషన్లకు సమాచారం పంపించారు. కానీ ఇప్పటివరకు ఎవరనేది ఆచూకీ తెలియలేదు. మృతదేహాన్ని ప్రాజెక్టులో నుంచి వెలికి తీసినప్పుడు మృతుడి ఒంటిపై చొక్కా లేదు. అలాగే తలపై వెంట్రుకలు లేకుండా గుండు గీయించుకొని ఉన్నాడు. మృతుని నాలుక బయటకు వచ్చి ఉండడం, మెడపై, ఛాతీపై గాయాలుండడంతో హత్యగా భావిస్తున్నారు. కాగా, మృతుడు శనివారం సమీప ఆలయంలో తలనీలాలు ఇచ్చి ఉంటాడని, రాళ్లపాడు మీదుగా ఊరికి వెళ్తుండగా అక్కడే అతని మెడకు ఏదైనా బలమైన తాడు వేసి చంపి, అనంతరం ప్రాజెక్టులో వేసి ఉంటారని పలువురు అనుమానిస్తున్నారు. మృతుడు ఎవరనే తెలిస్తేగానీ హత్యా. లేక ఆత్మహత్యా అనేది వెలుగు చూస్తుంది.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

మండల మీట్‌లో తహసీల్దార్

గుడ్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూసమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ విజయబాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 18 గ్రామపంచాయతీలకు గాను 11 గ్రామాల్లో మాత్రమే రీసర్వే పూర్తిచేశామన్నారు. అనంతరం కొందరు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ రీసర్వే మండలంలో అస్తవ్యస్తంగా చేయడంతో రైతుల భూసమస్యలు మరింత ఎక్కువయ్యాయని, నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుటు తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడంలేదని వాపోయారు. గుడ్లూరు - రాళ్లపాడు మంచినీటి పథకం ద్వారా తాగునీరు మురికిగా వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుడ్లూరు1 ఎంపీటీసి సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి 15 రోజులకొకసారి పంచాయతీల్లో వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి, పైప్‌లైన్‌లు లీకులు లేకుండా ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ అధికారులు బాధ్యత తీసుకొని ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించాలని సూచించారు. విద్యుత్ లైన్లు సక్రమంగా లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని పాజర్ల, పరకొండపాడు సర్పంచులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విధంగా ఆయా గ్రామాల సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంఈవో హరిరామ్ కోరారు. పండ్లతోటల సాగుకు రైతులకు సబ్సిడిపై మొక్కలు, రాయితీపై ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ యూనిట్లను అందచేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రవికుమార్, సర్పంచిలు పీ. శంకర్, పీ. వెంకటేశ్వర్లు, వై. శ్రీనివాసులు, జీ. సుబ్బరామయ్య పాల్గొన్నారు.


నీటి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరుతున్న ఎంపీటీసీ సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ

తారురోడ్డు నిర్మాణంపై విజిలెన్స్ విచారణ జరపాలి

కందుకూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):పట్టణం నుంచి మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెంకు ఇటీవల నిర్మించిన తారురోడ్డు పనులు అత్యంత నాసిరకంగా జరిగి నెల తిరగకుండానే రోడ్డు నెర్రెలిచ్చినందున ఈ పనులపై విజిలెన్స్ విచారణ జరపాలని వెంకటాద్రిపాలెంకు చెందిన సామాజిక కార్యకర్త జిల్లెలమూడి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తారురోడ్డును అత్యంత నాసిరకంగా నిర్మించటమే గాక సైడుబర్మ్‌లకు ఒక్క ట్రక్కు కూడా గ్రావెల్ తోలకుండా రోడ్డుసైడు మట్టినే జేసీబీతో వేసి చదునుచేయటంతో వర్షం పడితే వాహనాలు జారిపోతూ ప్రమాదాలు జరుగుతున్నాయని, జేసీబీతో మట్టితీసిన గుంతల కారణంగా రైతులు పొలాల్లోకి వెళ్లే అవకాశం కూడా లేక ఇబ్బందిపడుతున్నారని విమర్శించారు.


నెర్రెలిచ్చిన తారురోడ్డు

చెరువుల అభివృద్ధికి మోక్షమెప్పుడు?

● వర్షాకాలం ప్రారంభమయినా పట్టించుకోని అధికారులు
● మరమ్మతులకు నోచుకోని చెరువు కట్టలు

కొండాపురం. అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధానంగా చెరువుల నీటి ద్వారానే వరి సాగు చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే చెరువులను బాగు చేసుకుంటే ఆయకట్టు సాగుకు అవకాశం ఉంటుంది. వర్షాలు అనుకున్నంత స్థాయిలో పడకపోవడం, కాలువలు సరిగా లేకపోవడంతో వచ్చిన కొద్దిపాటి వాననీరు చెరువులకు చేరడంలేదు. దీంతో చెరువుల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని 19 పంచాయతీల పరిధిలో చిన్నా, పెద్దా కలిపి మొత్తం 36 చెరువులు ఉన్నాయి. ఈచెరువులకింద సుమారు 5 వేల ఎకరాలకుపైగా ఆయకట్టులో వరిని సాగుచేస్తున్నారు. వీటిలో శాయిపేట, కొమ్మి, గరిమెనపెంట గ్రామాలలో ఆయకట్టు ఎక్కువగా ఉండే చెరువులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో చెరువు కట్టలను పట్టించుకున్న పాపాన పోలేదు. చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకున్న చందంగా ఇరిగేషన్ అధికారులు పనితీరు ఉంది. వర్షాకాలం ప్రాంభమైనప్పటికీ కాలువలకు మరమ్మత్తులు, కట్టలపై ఉన్న కంపచెట్లను తొలగించడం, చెరువుకట్టలను బలోపేతం చేయడం, పూడికతీత వంటి పనులపై ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలులేవు. పెద్ద చెరువులయిన సాయిపేట, గండికట్ట, గరిమెనపెంట పెద్ద చెరువు, గుడవళ్లూరు, సత్యవోలు తదితర చెరువుల అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని అధికారులు చెబుతున్నారు. ప్రతిపాదనలకే పరిమితంగత ఏడాది వర్షాలకు తెగిపోయిన కొమ్మి పంచాయతీ పరిధిలోని గండికట్ట చెరువుకు అప్పట్లోనే ఇసుక బస్తాలతో తాత్కాలికంగా మరమ్మతులుచేశారు. తాత్కాలిక మరమ్మత్తులకొరకు రూ 10 లక్షల నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపినప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదు.


గుడవళ్లూరు చెరువులో మొలచిన కంపచెట్లు

14న మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో గదుల వేలం

కందుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌లలో గదులను అద్దెకు ఇచ్చేందుకు ఈనెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత లారీ స్టాండ్ ఆవరణలో నిర్మించిన ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో 1, 3 (ఎస్సీ), 5 (ఎస్టీ), 8 (టీఎల్ఎఫ్ అండ్ ఎస్ఎల్ఎఫ్), 12,13,15,17,18 (జనరల్) రూములకు, కల్లూరి కోటేశ్వరరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీ అయిన 6,7 (జనరల్) రూములకు, ముత్యాలకుంట పార్కులో ఉన్న గదికి అద్దె బహిరంగ వేలం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు నిబంధనల ప్రకారం మున్సిపల్ కార్యాలయంలో వేలంలో పాల్గొని రూములు దక్కించుకోవచ్చునని ఆమె తెలిపారు.

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

లింగసముద్రం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని మండల వైసీపీ అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీ రోడ్డులో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్‌స్తంభాల మార్పిడి పనులు జరుగుతున్నందున ఎమ్మార్వో ఆఫీసు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం ఆరున్నర నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఎఈ టీవీ నరసింహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని సుల్తాన్‌మొహిద్దీన్ హాస్పటల్ ఏరియా, సంతోష్‌నగర్, మక్కా మసీదు ఏరియా, ఎమ్మార్వో ఆఫీసు, బూడిదపాలెం, పాతబ్యాంకు బజారు, కోటకట్టవీధి, అన్నా క్యాంటీన్, పెద్దబజారు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు అసౌకర్యాన్ని గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

ఆల్‌ఇండియా తైక్వాండో పోలీసు క్రీడలకు రెఫరీగా అఖిల్


రెఫరీగా ఎంపికైన అఖిల్‌తో తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలాం

కందుకూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఈనెల 10 నుంచి 14వ తేది వరకు జరగనున్న ఆల్ ఇండియా 10వ పోలీసు జూడో క్లస్టర్ టోర్నమెంట్‌కు న్యాయనిర్ణేతగా కందుకూరుకు చెందిన వీ. అఖిల్ ఎంపికయ్యారని ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్‌సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ టోర్నమెంట్‌కు రెఫరీగా వ్యవహరించే అవకాశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అఖిల్‌కు దక్కటం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా అఖిల్‌ను పలువురు అభినందించారు.

నూనె, తీపి పదార్థాల వినియోగం తగ్గించాలి

కందుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనశైలిలో ఊబకాయం అనేక వ్యాధులకు కారణమవుతున్నందున నూనె, తీపి పదార్థాల వాడకం తగ్గించాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ యు ప్రభావతి సూచించారు. ఐసీడీఎస్ 8వ రాష్ట్రీయ పోషణమహ కార్యక్రమంలో భాగంగా సీడీపీఓ ఉషారాణి ఆదేశాలతో మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంట, పట్టణంలోని రెవెన్యూ కాలనీ, చాకలిపాలెం అంగన్వాడీ కేంద్రాలలో గురువారం కార్యక్రమాలు నిర్వహించి పోషకాహారం ఆవశ్యకత, ఊబకాయానికి కారణమవుతున్న ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో సూపర్‌వైజర్లు ఎల్ లక్ష్మీదేవి, షేక్ షకీలాబేగం, అంగన్వాడీ కార్యకర్తలు సునీత, నీలిమ, ఈశ్వరమ్మ, పుష్పలత, రోహిణి, సుజాత, రజిని, రాజేశ్వరి, ప్రశాంతి, సుభాషిణి, హసీనా, బేబీరూన్సీ, రమాదేవి పాల్గొన్నారు.


ఊబకాయంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది

మంత్రి లోకేశ్‌ను కలిసిన భాషా పండితులు

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భాషా పండితులకు పదోన్నతులు కల్పించినందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కావలికి చెందిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మగడ్డ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రవి చంద్రకుమార్ తదితర నాయకులు అమరావతిలోని తన నివాసంలో మంత్రిని కలిశారు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 10,224 మంది భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ భాషా పండితులుగా ఉన్నతీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం మంత్రి లోకేశ్ మిగిలిన భాషా పండితులకు కూడా పదోన్నతులు కల్పించి ఒక మహా యజ్ఞాన్ని పూర్తి చేశాడన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పండిత పరిషత్ పక్షాన వారు కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి లోకేశ్‌ను కలిసిన పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు,తదితరులు

వ్యక్తిపై దాడి : ఇద్దరిపై కేసు నమోదు

ఉలవపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని కొట్టి గాయపరిచిన సంఘటనలో అందిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కరేడు పంచాయతీ పరిధిలోని ఉప్పరపాలెంకి చెందిన ఆటో డ్రైవర్ బాలకృష్ణ గురువారం మధ్యాహ్నం కరేడులోని బ్రాందీ షాపు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కరేడు ఎస్సీ కాలనీకి చెందిన మేడిద శ్రీకాంత్, దామవరపు శ్రీకాంత్‌లు ఇరువురు ఉప్పరపాలెంకు చెందిన ఇద్దరు వ్యక్తులను కిందపడేసి కొడుతున్నారు. తన గ్రామస్థులు కావడంతో ఆటోడ్రైవర్ బాలకృష్ణ వారినుంచి బాధితులను పక్కకు తప్పించేందుకు యత్నించాడు. దీంతో వారు మాకే అడ్డువస్తావా అని ఆటోడ్రైవర్ బాలకృష్ణను పక్కనే ఉన్న రాళ్ల గుట్టపై పడేసి కొట్టడంతో గాయాలయ్యాయి. బంధువులు ఉలవపాడు సీహెచ్‌సీ తరలించి చికిత్స చేయించారు. వైద్యులు ఇచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నెల రోజులైనా.. దొంగను పట్టుకోలేరా!?

జలదంకి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం బ్రహ్మంగారి గుడిలో గత నెల 9వ తేదీ అర్ధరాత్రి రెండు అమ్మవారి తాళిబొట్లు చోరీ అయ్యాయని, సీసీ కెమెరాలో చోరుడి ఫొటో స్పష్టంగా కనిపిస్తున్నా నేటికీ పోలీసులు దొంగను ఎందుకు పట్టుకోవడం లేదని టీడీపీ నాయకుడు పూనూరు రామక్రిష్ణారెడ్డి పోలీసులను ప్రశ్నించారు. అన్నవరంలోని చోరీ జరిగిన గుడిలో భక్తులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్షణమే చోరీకి పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 8వ నంబరు చౌక ధాన్యపు డిపోలో రేషన్ కోటా తక్కువగా వస్తుండడంతో కార్డుదారులకు బియ్యం అందడం లేదన్నారు. ఎస్సీ కాలనీలో ఇళ్ళపై వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైనును తొలగించి, సమస్యను పరిష్కరించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు స్థానికుల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు కంచి క్రిష్ణారెడ్డి, నాయకులు దేవరిపల్లి రమణారెడ్డి, నాగూర్‌బాషా పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు రామక్రిష్ణారెడ్డి, తదిరులు

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కావలి రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కావలి మండల వ్యవసాయ శాఖాధికారిణి లలిత పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో అమరావతి సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కూడా లైసెన్స్ కలిగిన డీలరు వద్ద బిల్లులు తీసుకుని విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత 80 నుండి 90 మొలక శాతం చూసుకున్న తరువాత మాత్రమే నార్లు పోసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విత్తన కేంద్రం డీలర్ ఉప్పాల శీనయ్య తదితరులు పాల్గొన్నారు.


సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న ఏవో లలిత

బోగోలులో రోడ్లపైనే వర్షపు నీరు


రోడ్డుపై నిలిచిన వాన నీరు

బిట్రగుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండల తహసీల్దారు, ఇతర మండల కార్యాలయాలకు వెళ్లే తెలుగు బాప్టిస్ట్ చర్చి రోడ్డులో వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. మట్టి, చెత్తచెదారం నిండిపోవడంతో ప్రధాన కాలువల్లో నీరు స్తంభించిపోయింది. రైల్వే ఎల్సీగేట్ 143 కుమ్మరవీధి మార్గంలో గుంతలు పడడంతో వాననీరు నిలిచి పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. యాదవపాలెం, పాత హరిజనవాడ ప్రాంతాల్లో కాలువలు దెబ్బతిన్నందున మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కొద్దిపాటి వర్షానికే రోడ్లు ఇలా ఉంటే వర్షాకాలంలో మరెంత దారుణంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాన నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

12న యాదే కిషోర్‌కుమార్ మ్యూజికల్ నైట్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హిందీ చిత్రసీమలో ప్రముఖ నేపథ్య గాయకుడు కిషోర్‌కుమార్ 38వ వర్ధంతి సందర్భంగా ఈనెల 12న మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయకుడు జావీద్ తెలిపారు. ఈ కార్యక్రమ పోస్టర్లను గురువారం టౌనుహాలులో ఆవిష్కరించారు. మ్యూజికల్ నైట్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. 12వతేదీ సాయంత్రం 6 గంటలకు టౌనుహాలులో జరిగే ఈ కార్యక్రమానికి సంగీత ప్రియులు హాజరుకావాలని కోరారు.

సాయిపేట పంచాయతీ విభజనకు అభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు

కొండాపురం,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలో మేజర్ పంచాయతీగా ఉన్న సాయిపేటను విభజించేందుకు గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి పీ. కోటేశ్వరమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీల విభజనకు ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. పంచాయతీలోని మక్కెనవారిపాలెం, వెల్లటూరివారిపాలె, ఇస్కపాలెం, కొమ్ముపాలెం గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీని విడగొట్టేందుకు గ్రామ పెద్దలు, ప్రజలు అంగీకరించారు. అనంతరం పంచాయతీ వార్డుసభ్యులతో సమావేశం ఏర్పాటు చేయగా మెజారిటీ సభ్యులు పంచాయతీ విభజన తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో ప్రోటోకాల్ పాటించలేదని గ్రామస్థుడు గంటా శ్రీనివాసులు డిప్యూటీ ఎంపీడీవోను అడగగా, ఇది అభిప్రాయసేకరణ సమావేశమని అధికారిక సమావేశం కాదని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, సీనియర్ నాయకుడు గంటా లక్ష్మినరసింహులు, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, జిల్లా టెలికాం డైరెక్టర్ టి. అనూష, సాగునీటి సంఘ అధ్యక్షుడు టి. ప్రవీణ్, వల్లూరు వెంకటేశ్వర్లు, దామా శివబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


ఐరన్ సిరప్‌లు అందచేస్తున్న రామ్‌సెంటర్ నిర్వాహకులు

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో గురువారం ముసునూరులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, చంద్రబాబు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన నిర్వహించారు. గర్భిణిలు, బాలింతలు తప్పకుండా ఆకుకూరలు, చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామ్‌సెంటర్ డైరెక్టర్ కే. తాతిరెడ్డి, లింగనిర్ధారణ నిషేధ కమిటీ సభ్యుడు మాలకొండారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, దీనకుమారి, శివలీల, సుశీల, విజయలత, గర్భిణిలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.


పుదుచ్చేరి క్యాంపులో పీజీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు

కావలి (టౌన్)అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పుదుచ్చేరి ప్రభుత్వంచే కావలిలోని వీఎస్‌యు పీజీ కళాశాల విద్యార్థులు ప్రశంశలందుకున్నారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీ నివాసరావు, ఆచార్యులు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెన్నాలజీ ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో సెప్టెంబరు 17 నుంచి 20 రోజుల పాటు సేవ పర్వ్ క్యాంపెయిన్ జరిగిందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ సుశీల ఆధ్వర్యంలో విద్యార్థులు వ్యాసరచన, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచి పుదుచ్చేరి ప్రభుత్వంచే ప్రశంస పత్రాలు అందుకోవడం అభినందనీయమన్నారు. వంశి, శశికళ, రేవతి విజేతలుగా నిలవగా, అనూష, సౌందర్య, ఇందు, దివ్య, అభిలాష్ పోటీల్లో పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కొండాయపాలెం లోని అబైండింగ్ హోప్ ట్రస్ట్‌లో గురువారం పౌష్టికాహార పంపిణీ జరిగింది. సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్ రజిని అతిథిగా హాజరయ్యారు. అనారోగ్యంతో ఒత్తిడి, ఆందోళన చెందరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల్‌కుమార్, లెక్చరర్ స్వర్ణలత, ఏ జయప్రకాష్, సిస్టర్ రమా, సిస్టర్ జయ పాల్గొన్నారు.





మనపాళెం వద్ద ముందుకొచ్చిన సముద్రం

అక్కడ ముందుకు.. ఇక్కడ వెనక్కి

● సముద్రతీరంలో విచిత్ర పరిస్థితి

తూర్పు సముద్రతీరంలో విచిత్ర పరిస్థితులు నెలకొనడంతో మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. కొన్ని రోజులుగా వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. ఉన్నట్లుండి గురువారం 15 మీటర్లు వెనక్కివెళ్లింది. దీనికి భిన్నంగా.. ఇక్కడికి ఐదు కిలోమీటర్ల దూరంలోని మనపాళెం వద్ద సముద్రం 5 మీటర్లు ముందుకు వచ్చింది. ఈ విచిత్ర పరిస్థితుల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లలేదు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

మనవడా.. ఎక్కడున్నావురా

కనిపించిన వారికంతా చేతిలో కరపత్రం చూపుతోంది. అందులోని ఫొటో చూపించి మీకేమైనా కనిపించాడా అని అడుగుతోంది. ఇలా మతిస్థిమితంలేని మనవడి కోసం అమ్మమ్మ చెల్లమ్మ.. ఊరూవాడా తిరుగుతోంది. సూళ్లూరుపేట మండలం మాంబట్టుకు చెందిన నెల్లూరు దిలీప్(21) వినాయకచవితి నాడు సూళ్లూరుపేట బస్టాండ్‌లో తప్పిపోయాడు. మతిస్థిమితం లేని దిలీప్ ఎటు వెళ్లాడో తెలియక తల్లిదండ్రులు, అమ్మమ్మ, తాతయ్య కరపత్రాలు పట్టుకొని ఊరూరా తిరుగుతున్నారు. ఇలా చెల్లమ్మ గురువారం ఉదయం చిట్టమూరు మండలం కొత్తగుంట సెంటర్లో టీ దుకాణం వద్ద కరపత్రం చూపుతూ మనవడి ఆచూకీ కోసం అభ్యర్థించింది.

- చిట్టమూరు, ఆంధ్రజ్యోతి



కొత్త టీచర్లకు కౌన్సెలింగ్ చిక్కులు

● ఎస్జీటీలకు మాన్యువల్, ఎస్ఏలకు వెబ్ కౌన్సెలింగ్
● రాత్రి వేళ తిరుపతిలో అయ్యోర్ల పడిగాపులు



తిరుపతిలో అభ్యర్థుల నుంచి ఆప్షన్ ఫామ్ తీసుకుంటున్న ఆర్జేడీ శామ్యూల్

తిరుపతి (విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించబోయే వారికి కౌన్సెలింగు ప్రారంభంలో చిక్కులు ఎదురయ్యాయి.సెకండరీ గ్రేడ్ టీచర్లు పోస్టింగ్ కౌన్సెలింగు కోసం తిరుపతిలో గురువారం రాత్రి పడిగాపులు కాయాల్సి వచ్చింది.డీఎస్సీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1403మంది ఉద్యోగం పొందారు. వీరిలో 1394 మంది ఈనెల 3నుంచి చిత్తూరు, తిరుపతి కేంద్రాల్లో శిక్షణా తరగతులకు హాజరు కాగా, తొమ్మిదిమంది గైర్హాజరయ్యారు.తిరుపతి నగరం జీవకోనలోని విశ్వం స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు గురువారం రాత్రి 11గంటల తరువాత మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రారంభించారు. ఆర్జేడీ శామ్యూల్, తిరుపతి డీఈవో కేవీఎస్ కుమార్, చిత్తూరు డీఈవో బి.వరలక్ష్మి కౌన్సిలింగ్‌ను పర్యవేక్షించారు. ఒకటినుంచి 250వ ఒంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగు పూర్తి చేస్తారు.శుక్రవారం 251నుంచి 700వరకూ తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలోని మెడ్జ్ స్కూల్లో, 701నుంచి 922వరకూ గూడూరులోని ఆదిశంకరా ఇంజనీరింగు కళాశాలలో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.కాగా కొత్త ఉపాధ్యాయులకు శుక్రవారంతో శిక్షణ తరగతులు ముగియనున్నాయి. గురు,శుక్రవారాల్లో కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయిస్తారు.వీరంతా సోమవారం విధుల్లో చేరాల్సి ఉంది.పాఠశాల కేటాయింపుల కౌన్సెలింగ్ ప్రక్రియలో గురువారం గందరగోళం నెలకొంది. 917 మంది ఎస్జీటీ అభ్యర్థులకు బుధవారం నుంచి తొలుత వెబ్ కౌన్సెలింగ్ అంటూ చెప్పిన అధికారులు, గురువారం సాయంత్రానికి ఆ ప్రక్రియను మాన్యువల్‌గా మార్చారు. స్కూల్ అసిస్టెంట్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ అంటూ చివరికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు.ఇందుకు సంబంధించి ఎస్ఏలకు ఖాళీలను ఎంచుకునేందుకు వెబ్ ఆప్షన్లు ఇచ్చారు.

పూర్తి ఖాళీలు చూపని వైనం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇటీవల ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించారు. కౌన్సెలింగ్ ద్వారా సీనియారిటీ జాబితా ఆధారంగా, ఉపాధ్యాయులు స్థానాలు కోరుకుని విధుల్లో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యాశాఖలో క్లియర్ వేకెన్సీలు వచ్చేశాయి. అయితే కొత్తగా వచ్చే ఉపాధ్యాయులకు క్లియర్ వేకెన్సీలు పూర్తిగా చూపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. హెచ్ఆర్‌కే ఒకటి, రెండు కేటగిరీల ఖాళీలు చూపకుండా, కేవలం హెచ్ఆర్‌కే మూడు, నాలుగు కేటగిరీల వేకెన్సీలు చూపుతున్నారు. దీంతో కొత్త ఉపాధ్యాయులకు మండల స్థాయి, మారుమూల గ్రామీణ ప్రాంత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయి.1394మంది ఉపాధ్యాయులకు 1:1 ఖాళీలు మాత్రమే చూపుతున్నారు. అంటే 1394 స్థానాలనే వేకెన్సీలుగా చూపుతున్నారు. కాగా ఒకటి రెండు కేటగిరిలైన మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో ఏకంగా 500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించినా, వీటిని కౌన్సెలింగ్‌లో చూపకపోవడంపై విమర్శలు వచ్చాయి.

రాత్రి 11.30 గంటలకు మొదలైన కౌన్సెలింగ్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొత్తగా ఎంపికైన 917మంది ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం రాత్రి 11.30 గంటలకు తిరుపతిలో మొదలైంది. వాస్తవానికి సాయంత్రం 5 గంటలకు మొదలు పెట్టి రాత్రి 11 గంటలకు ముగించాలని రాష్ట్రస్థాయి అధికారులు సూచించారు. మరో వైపు ఖాళీల జాబితా ప్రచురించడంలోనూ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించడం ఉపాధ్యాయుల్ని నిరాశకు గురిచేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తంగా 917మంది ఉన్నారు. ఎస్జీటీ (తెలుగు)లో 753మంది మండల పరిషత్ స్థాయిలో ఎంపిక కాగా, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 75మంది, మున్సిపాలిటీ పరిధిలో 53మంది, ఎస్జీటీ (ఉర్దూ)లో ఎంపీపీ స్థాయిలో 30మంది, మున్సిపాలిటీలో ఒకరు, ఎస్జీటీ (తమిళం)లో ఎంపీపీ పరిధిలో ఎంపికైన ఉపాధ్యాయులు ఐదుగురు ఉన్నారు.



గురువారం రాత్రి జరిగిన కౌన్సెలింగ్‌కు హాజరైన నూతన ఉపాధ్యాయులు

బీఎడ్.. వెరీ డిమాండ్

● 'పద్మావతి' వర్సిటీ దూరవిద్యలో
500 సీట్లకు 2,500 మంది హాజరు



బీఎడ్ కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఇన్ సర్వీసు బీఎడ్ కోర్సుకు డిమాండ్ పెరుగుతోంది. ఉద్యోగులు పదోన్నతుల కోసం రెండేళ్ల కాల పరిమితి గల ఈ కోర్సులో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. 2019 వరకు ఇయర్లీ పాట్రెన్ పరీక్షలతో ఈ కోర్సు నిర్వహించేవారు. అయితే, డిస్టెన్స్ ఎడ్యుకేషనస్ బోర్డు (డెబ్) సెమిస్టర్ విధానంలో ఈ కోర్సు నిర్వహించాలనే నిబంధన పెట్టింది. దీంతో 2019 తర్వాత ఈ కోర్సు కొనసాగలేదు. సెమిస్టర్ విధానానికి అవసరమైన సిలబస్ రూపకల్పన, ఇతర ఏర్పాట్లు చేయడంతో కోర్సు నిర్వహణకు డెబ్ అనుమతించింది. ఆ యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో గురువారం అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. 500 సీట్లకు ఏకంగా 2,500 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసినట్లు దూరవిద్యా విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు.

జేసీ శుభమ్ బన్సల్ బదిలీ

● పరిశ్రమల డైరెక్టర్‌గా కీలక పోస్టింగ్



తిరుపతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్ బదిలీ అయ్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఆయన పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. జూనియర్ అధికారి అయినప్పటికీ చాలా కీలక పోస్టింగ్ అందుకున్నారు. గతేడాది జూలై 24న జేసీగా బాధ్యతలు తీసుకున్న ఈయన ప్రజలతో, ప్రజాప్రతినిధులతో పెద్దగా మమేకం కాలేకపోయారు. భూసేకరణ, ఇతర భూ అంశాలకు సంబంధించి తొందరపడి ఫైళ్లు క్లియర్ చేస్తే వివాదాల్లో చిక్కుకుంటామేమోనన్న అనుమానంతో జాప్యం చేయడంతో పెండింగ్ పడుతూ వచ్చాయి. అదే సమయంలో జిల్లాలో పారిశ్రామిక, జాతీయ రహదారులపరంగా భూసేకరణ విషయాల్లో చురుగ్గా పనిచేశారు. పారిశ్రామికంగా జిల్లా కీలక స్థానంలో ఉన్న నేపథ్యంలో జేసీగా శుభమ్ బన్సల్ పనితీరును, ఆయన అవగాహనను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం కీలకమైన పరిశ్రమల శాఖకు డైరెక్టర్‌గా బదిలీ చేసింది. గతంలోనే నియమించాలని ప్రయత్నించినా జిల్లాలో ఆయన అవసరం ఉందంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అభ్యర్థించడంతో ఆ ప్రతిపాదనను విరమించుకుంది. కాగా, జిల్లాకు ఎవరినీ జేసీగా నియమించలేదు.

రుయా.. ఏందయా!

● అత్యవసర విభాగంలో ఒకే పడకపై ఇద్దరేసి రోగులకు వైద్యం
● ఆరు బయట సహాయకులకు తిప్పలు



అత్యవసర వార్డులో ఒకే పడకపై ఇద్దరికి చికిత్స

పేదల ఆస్పత్రిగా పేరున్న రుయాను.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా హోదా పెంచారు. అందుకు తగ్గ వైద్యులను నియమించారు. కానీ, పెరుగుతున్న రోగులకు సరిపడా వసతులను, పడకలను పెంచలేదు. దీంతో ఆస్పత్రి లోపల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అత్యవసర విభాగంలో 30 పడకలే ఉన్నాయి. రోగులకు సరిపోక ఒకే పడకపై ఇద్దరేసి అవసరమైతే ముగ్గురికి కూడా వైద్యం చేయాల్సిన పరిస్థితి. ఇక, చికిత్స పొందుతున్న వారికి సాయంగా వచ్చే సహాయకులు వేచి ఉండేందుకు భవనం లేదు. కనీసం భోజనం చేసేందుకు కూడా సరైన ప్రదేశం లేదు. దీంతో ప్లాట్‌పారంపైన, పార్కింగ్ ప్రదేశాల్లో సేద తీరుతూ, రోడ్డు పక్కనే భోజనం చేస్తూ అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే ఏ చెట్టు కనిపిస్తే అక్కడకు పరుగులు తీసి తలదాచుకోవాల్సి వస్తుంది. ప్రధానంగా చిన్నపిల్లలతో వచ్చే సహాయకులు, వృద్ధులు పడే అవస్థలు వర్ణనాతీతం. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ఏడాది ముందు వరకు రోజుకు ఓపీ కేసులు: 1000-1200
అత్యవసర కేసులు: దాదాపు 200
ఇప్పుడు ఓపీలు: 1800-2000
అత్యవసర కేసులు: 500





షెల్టర్ లేక రోగుల సహాయకుల అవస్థలు - రోడ్డు పక్కనే భోజనం చేస్తూ..

సదరన్ డిస్కం సీఎండీగా శివశంకర్



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం సీఎండీగా లోతేటి శివశంకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సీఎండీ కె.సంతోష రావు రెండు రోజులుగా రాష్ట్ర స్థాయి సమావేశాల నిమిత్తం విజయవాడలో ఉన్నారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా, సీఎండీగా నియమితులైన శివశంకర్, గతంలో కడప కలెక్టర్‌గా పనిచేసే సమయంలో ఐఏఎస్‌ల విభజన జరిగింది. అప్పట్లో తెంగాణకు బదిలీ అయ్యారు. సొంత రాష్ట్రంలో సేవలందించాలన్న సంకల్పంతో క్యాట్, న్యాయస్థానాలను ఆశ్రయించి తిరిగి ఏపీకి కేటాయించుకున్నారు. గతంలో పాడేరు సబ్ కలెక్టర్‌గాను, ఐటీడీఏ పీవోగాను పనిచేశారు. అనంతరం పల్నాడు తొలి కలెక్టర్‌గా పనిచేశారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శివశంకర్‌ది విజయనగరం జిల్లా ధర్మవరం. ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఏసీటీవోగా పనిచేస్తూ ఐఏఎస్ అయ్యారు.

నేడు ఎస్వీయూ కొత్త వీసీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ నూతన వీసీగా ప్రొఫెసర్ నరసింగరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాదు నుంచీ ఉదయం తిరుపతికి చేరుకుని, ఓ అధికారిక ఆన్‌లైన్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. ఆ తర్వాత వీసీగా బాధ్యతలు చేపట్టనున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను రిజిస్ట్రార్ భూపతి నాయుడు నేతృత్వంలోని అధికార యంత్రాంగం పూర్తి చేసింది.

ముక్కంటి ఆలయ భద్రతపై దృష్టి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీకాళహస్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ భద్రత పటిష్టతపై ఈవో బాపిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. 'ముక్కంటి ఆలయంలోకి నాగశిలలు' తేవడంపై గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంపై స్పందించిన ఈవో.. భద్రతా సిబ్బందిని వివరణ అడిగారు. సెక్యూరిటీ గార్డులు, హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బందితో మాట్లాడి భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.

ఏం జరుగుతోంది?

● రెండు రోజులుగా డ్యూయాంగన్‌ను విచారిస్తున్న ఈడీ అధికారులు
● కీలక రికార్డులు స్వాధీనం



డ్యూయాంగన్ ఉండే భవనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒప్పంద కాంట్రాక్టరుగా ఓ పరిశ్రమలో పనిచేసేందుకు చైనా నుంచి డ్యూయాంగన్ వచ్చాడు. వీసా గడువు ముగిసినా వెళ్లలేదు. బెయిల్‌పై బయట ఉంటూ అనేక వ్యాపారాలు చేస్తున్నాడు. ఇతడి ఆర్థిక లావాదేవీలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైదరాబాదు ఎన్‌ఫోర్సుమెంటు అసిస్టెంట్ కమిషనర్ అభిషేక్ నేతృత్వంలో పది మంది అధికారులు బుధవారం ఉదయం రేణిగుంట మండలం గురవరాజుపల్లెలోని అతడి ఇంట్లో సోదాలు మొదలు పెట్టారు. అప్పట్నుంచి డ్యూయాంగన్‌ను అదుపులోకి తీసుకుని గురువారం కూడా సోదాలు, విచారణ కొనసాగించారు. బిగ్ కిచెన్ పేరుతో చైనా కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇతడు ఆహారం సరఫరా చేస్తున్నాడు. వివిధ చైనా కంపెనీల నుంచి స్క్రాబ్ కొని వ్యాపారం చేస్తున్నాడు. కొంతమంది చైనీయులు, స్నేహితుల పేరిట వ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం. మూడేళ్లుగా వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండటం, పన్నులు చెల్లించకుండా, వివిధ కంపెనీల పేరుతో వ్యాపారాలు నిర్వహించడం, హవాలా రూపంలో డబ్బు దేశం దాటిస్తున్నాడంటూ వచ్చిన ఫిర్యాదులపై ఈడీ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. కాగా, గురువారం ఏర్పేడు మండలం వికృతమాలలో ఇతడి స్క్రాబ్ గోడౌన్లలోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. అక్కడ రికార్డులు, కొన్ని రసీదులు, బిల్లు పుస్తకాలు, రవాణా.. వే బిల్లులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక, డ్యూయాంగన్‌కు అకౌంట్లున్న బ్యాంకులకు సంబంధించి కొందరు అధికారులను పిలిపించి విచారించినట్లు తెలిసింది. అతడి బ్యాంకు పాసుపుస్తకాలు, చెక్‌లు, మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. బ్యాంకు అకౌంట్లు హోల్డ్‌లో పెట్టారు. కాగా, బ్యాంకు లావాదేవీలపై శుక్రవారం తనిఖీలు చేస్తారని సమాచారం.

రైల్లో నుంచి జారిపడి ఇంటర్ విద్యార్థి మృతి


సంతోష్ (ఫైల్ ఫొటో)

నాయుడుపేట టౌన్/వరదయ్యపాళెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైల్లో నుంచి జారిపడి ఇంటర్ విద్యార్థి సంతోష్(17) మృతి చెందాడు. వరదయ్యపాళెంలోని బజారు వీధిలోని పరంధామయ్య కుమారుడు సంతోష్ నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఇతడు.. తిరిగి కళాశాలకు వెళ్లేందుకు తడలో రైలు ఎక్కాడు. నాయుడుపేట స్టేషన్ సమీపంలో రైల్లో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ రామాంజనేయులు, సినీ దర్శకుడు వీవీ వినాయక్, నటి రోహిణి, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తెలంగాణ శివశక్తుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ శ్యామలాదేవి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వివి వినాయక్ - రోహిణి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,861

తలనీలాలు సమర్పించినవారు: 31,802





తరునీష్ జత్యా

ఇష్టపడిన రంగంలో కష్టపడితే ఫలితాలెలా ఉంటాయో నిరూపిస్తున్నాడు తరునీష్ జత్యా. తనకు నచ్చిన విలువిద్య పై ఫోకస్ పెట్టి బాణంలా దూసుకుపోతున్నాడీ కుర్రాడు. అర్జునుడిలా విల్లు ఎక్కి పెట్టి లక్ష్య ఛేదనలో చక్కగా రాణిస్తున్నాడు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ పతకాలను సొంతం చేసుకుంటున్నాడు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

గురి తప్పని తరునీష్

- విలువిద్యలో చక్కని ప్రతిభ
- ఒలింపిక్ లక్ష్యంగా పరిశ్రమ



డబుల్ గోల్డ్ మెడల్స్‌తో...

గూడూరు పట్టణంలోని ధూర్జటినగర్ ప్రాంతానికి చెందిన కోదండపాణి, సత్య దంపతుల కుమారుడు తరునీష్ జత్యా. కోదండపాణి టీవీ మెకానిక్‌గా పనిచేస్తూ కుమారుడ్ని ఏదో క్రీడలో గొప్పవాడిగా చూడాలని ఆశపడేవాడు. ఈ క్రమంలో గూడూరులో అర్జున్ ఆర్చరీ అకాడమీ ఏర్పాటైంది. విలువిద్యపై తరునీష్ ఆసక్తిని గమనించి 2018లో అందులో చేర్పించాడు. అప్పుడు 5వ తరగతి చదువుతున్న తరునీష్ కోచ్ శివశంకర్ వద్ద నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. ప్రావీణ్యత సాధించాడు. అంకుఠిత దీక్ష, ఏకాగ్రత ఉంటేనే నిలదొక్కుకునే ఈ క్రీడలో అంచెలంచెలుగా రాణిస్తూ వస్తున్నాడు. ప్రస్తుతం సైదాపురంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మరోపక్క అహ్మదాబాదులోని ఓ ఆర్చరీ అకాడమీలో నాలుగు నెలలుగా శిక్షణ పొందుతున్నాడు.

ఒలింపిక్‌లో మెడల్ లక్ష్యం

ఆర్చరీ అంటే ప్రాణం. పదో ఏడాది నుంచి ఈక్రీడపైనే దృష్టి పెట్టాను. అమ్మానాన్నలూ ప్రోత్సాహమందిస్తున్నారు. మన దేశం తరఫున ఒలింపిక్ పోటీలలో పాల్గొని పతకం సాధించడమే నా ముందున్న ఏకైక లక్ష్యం. ఇందుకు పట్టుదలతో శ్రమిస్తున్నాను. అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాననే నమ్మకముంది.

- తరునీష్ జత్యా

పదో ఏట నుంచే పతకాలు

తరునీష్ చిన్నతనం నుంచే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ఆర్చరీ పోటీలలో ప్రతిభ చాటుతున్నాడు. గతేడాది నవంబరులో గుజరాత్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వ్యక్తిగత, ఓవరాల్ విభాగాలలో డబుల్ గోల్డ్ మెడల్స్ సాధించాడు. స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ కుర్రాడి ప్రతిభకు ముచ్చటపడి రూ.50 వేలు నగదు ప్రోత్సాహక బహుమతితో సత్కరించారు. ఈ ఏడాది మేలో బీహార్ జరిగిన ఖేలో ఇండియా పోటీల్లోనూ మెరిసి కాంస్య పతకం దక్కించుకున్నాడు. 2022లో రాష్ట్రస్థాయి జూనియర్స్‌లో, గతేడాది రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్‌లో మొదటిస్థానంలో నిలిచాడు. ఈయేడాది జనవరిలో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచాడు.

సహకార రంగ అభివృద్ధికి ప్రణాళిక

- పీఏసీఎస్ వ్యాపార విస్తరణకు కృషి
- ముగింపు సదస్సులో కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని


సదస్సుకు విచ్చేసిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సహకార రంగం సాంకేతిక ఆధారిత బహుముఖాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికలకు రూపకల్పన చేసినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని తెలిపారు. తిరుపతి తాజ్‌హోటల్‌లో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. 'సహకార్ సే సమృద్ధి- సహకారంతో సుసంపన్నత' అంశంపై చర్చించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కంప్యూటరీకరణ, డిజిటల్ లావాదేవీలు, బహుముఖ సేవలపై చర్చించినట్లు చెప్పారు. ఏపీలో 2,021 పీఏసీఎస్‌లను డిజిటలైజేషన్ చేసి ఈ-పీఏసీఎస్‌గా మార్చడం అభినందనీయమన్నారు. పీఏసీఎస్‌లలో నగదు రహిత లావాదేవీలు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా పేపర్‌లెస్ వ్యవస్థలు, వన్‌స్టాప్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో పాలు, మత్స్య సహకార సమాఖ్యను బలోపేతం చేస్తామని వివరించారు. అనారోగ్య సహకార సంస్థల లిక్విడేషన్‌కు బదులుగా సంస్కరణలు చేపడతామని చెప్పారు. ఈ సదస్సు విజయవంతంగా ముగియడంతో కలెక్టర్ వెంకటేశ్వర్, అధికార యంత్రాంగానికి ఆశిష్‌కుమార్ భూటాని, రాష్ట్ర సహకార కమిషనర్ బాబు అభినందనలు తెలిపారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సహకార శాఖ అధికారులతో పాటు జిల్లా అడిషనల్ రిజిస్ట్రార్ ఆనందబాబు, గౌరీశంకర్, డీసీవో లక్ష్మి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారు

- నేను చనిపోయాక నగదు నా ఇంటికి చేర్చండి
- ఎస్వీ జూపార్కు టైమ్‌స్కేల్ ఉద్యోగి సెల్ఫీ వీడియో

మంగళం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తాను చేసిన పనులకు డబ్బులు ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నారంటూ ఎస్వీ జూపార్కులో టైమ్‌స్కేల్ ఉద్యోగి హరియాదవ్ బుధవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన సెల్ఫీ వీడియో సంచలనంగా మారింది. 'నేను జూపార్కులో అనేక పనులు చేశా. దీనికి రూ.11లక్షలకు నగలు కుదువబెట్టా. బిల్లులు అడిగితే ఒకసారి రూ.7.70లక్షలు, మరోసారి రూ.50వేలు, ఇంకోసారి రూ.లక్ష, ఆ తర్వాత రూ.8వేలు ఇచ్చారు. ఇంకా రూ.26లక్షలు రావాలి. ఈ బిల్లులు ఇవ్వకుండా నన్ను ఇబ్బంది పెడుతున్నారు. సహనం కోల్పోయి నేను ఆత్మహత్య చేసుకుంటే.. ఆ మొత్తాన్ని నా కుటుంబానికి అందించండి' అంటూ కన్నీటితో సెల్ఫీ వీడియో పెట్టారు. ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరపాలని డిమాండు చేశారు. దీనిని చూసిన వారంతా ఆందోళన చెందారు. కాగా, గురువారం హరి జూపార్కులో తన విధులకు హాజరుకావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

అతడి అక్రమాలు బయటపడతాయనే

- అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్

హరి సెల్ఫీ వీడియోపై ఎస్వీ జూపార్కు అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ స్పందించారు. '2023లోనే అతడు చేసిన పనులకు బిల్లులను చెల్లించాం. సెప్టెంబరు నెలలో హరి చేసిన పనులపై వచ్చిన ఆరోపణలకు క్యూరేటర్ సెల్వం ఏసీఎఫ్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ వేశారు. అతడి వద్ద బిల్లులు ఏవైనా ఉంటే ఇవ్వాలని కమిటీ కోరినప్పుడు.. నా వద్ద ఏమీ లేదని అతడు రాతపూర్వకంగా రాసిచ్చారు. హరి చేసిన పనుల్లో జరిగిన అవకతవకలు బయటపడతాయని భయపడి ఇలా చేసి ఉంటారు' అని జగదీష్ చంద్రప్రసాద్ తెలిపారు. జూపార్కు క్యూరేటర్ ఆదేశాలతో దీనిపై లోతైన విచారణ జరిపి అతడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఏర్పేడు పీఏసీఎస్‌కు సిక్కిం ప్రతినిధులు


పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఉన్న సిక్కిం సహకార శాఖ ప్రతినిధులు తదితరులు

ఏర్పేడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని (పీఏసీఎస్) గురువారం సిక్కిం రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ కార్యదర్శి గ్లోరియా నాంచ్, అదనపు రిజిస్ట్రార్ కేశాంగ్ యాంకీ తదితరులు సందర్శించారు. తిరుపతిలో సదస్సుకు హాజరైన వీరు చివరి రోజు ఏర్పేడు పీఏసీఎస్‌కు వెళ్లారు. అక్కడి వ్యాపార లావాదేవీలను, ఈకేవైసీ నమోదు, రుణపంపిణీ, హార్డ్‌వేర్ కిట్లు తదితరాలను పరిశీలించారు. టెక్నాలజీ వినియోగం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నాగవర్ధన, అధికారులు సురేష్‌కుమార్, నాగభూషణం, సంధ్యారాణి, తేజస్విని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుడి దర్శనానికి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి దుర్మరణం


సురేష్ బాబు (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అరుణాచలేశ్వరుడి దైవ దర్శనానికి వెళ్లిన షార్ ఉద్యోగి పగడాల సురేష్ బాబు(45) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ వాల్స్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సురేష్ బాబు కుటుంబం సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగుల కాలనీ డీఆర్‌డీఎల్‌లో నివాసం ఉంటోంది. మంగళవారం విధులు ముగిశాక ఆ రోజు రాత్రి పౌర్ణమి కావడంతో ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై అరుణాచలానికి బయలుదేరి వెళ్లాడు. ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తమిళనాడు పోలీసులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు లభ్యం కాకపోవడంతో మోటారు సైకిల్ నెంబరు ఆధారంగా అడ్రసు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. బంధువులు వెంటనే షార్ అధికారులకు తెలియజేశారు. షార్ అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాదం జరిగిన ప్రదేశానికి బుధవారం రాత్రి చేరుకున్నారు. తమిళనాడు పోలీసులు గురువారం పోస్టుమార్టం పూర్తి చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సహచర ఉద్యోగులతో కలిసిమెలిసి ఎంతో సఖ్యతగా ఉండే సురేష్ బాబు మృతి చెందాడన్న విషయం తెలియగానే షార్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. శివయ్య దర్శనం కోసం బయలుదేరి అనంతలోకాలకు వెళ్లావా.. అంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారంపై నిందితుడి అరెస్టు

- వెస్ట్ సీఐ మురళీమోహన్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేశారన్న కేసులో నిందితుడిని తిరుపతి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వెస్ట్ సీఐ మురళీమోహన్ తెలిపిన ప్రకారం.. సత్యసాయి జిల్లా కదిరి టౌన్ జౌకుపాళ్యంకు చెందిన కౌలేపల్లి అంజాద్‌ఖాన్ సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైళ్లను సృష్టించి వాటి ద్వారా ఇతర రాజకీయ పార్టీలు, వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నాడు. ఇందులో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి లోకేశ్, నందమూరి బాలకృష్ణ గౌరవం.. మనోభావాలు దెబ్బతీసే పోస్టులు పెట్టాడు. వీరిపై అసత్య ప్రచారాలు చేసినట్లు దర్యాప్తులో తేలడంతో గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, వర్గాల మధ్య విభేదాలు రేకెత్తించే వ్యాఖ్యలు, పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మురళీమోహన్ హెచ్చరించారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

- డీఈవోకు స్పష్టం చేసిన ఫ్యాప్టో నేతలు


డీఈవోకు నోటీసు అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

తిరుపతి(విద్య), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అసోసియేషన్ (ఎఫ్ఏపీటీఓ) నాయకులు స్పష్టం చేశారు.ఆ మేరకు వారు గురువారం డీఈవో కేవీఎన్ కుమార్‌కు నోటీసు అందజేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సురేష్, డిప్యూటీ జనరల్ రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అంతకుముందు డీఆర్వోకు కూడా తమ నిర్ణయాన్ని తెలియజేశారు. ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ జగన్నాథం, ఇతర నాయకులు ముత్యాలరెడ్డి, ఎస్ఎస్ నాయుడు, రవీంద్ర, వాసు, నిర్మల, మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, మధు, రుక్మాంధ, సుబ్బారావు, పద్మజ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు చెకుముకి పేరుతో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఏటా నిర్వహించే సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, ఆర్థిక కార్యదర్శి బాషా, జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం, గణిత ఫోరం సభ్యులు, ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెటర్నరీలో ముగిసిన జాతీయ సదస్సు

- 42 మందికి బహుమతుల ప్రదానం


సర్టిఫికెట్, జ్ఞాపికను అందిస్తున్న రిజిస్ట్రార్ వినూ, డీన్ బ్రహ్మయ్య, ఏడీ జగపతిరామయ్య, పక్కన వైకుంఠరావు

తిరుపతిరూరల్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల పశువైద్య చికిత్స, బోధన సముదాయ(వీసీసీ)విభాగ ఆధ్వర్యంలో నేషనల్ క్లినికల్ కేస్ కాన్ఫరెన్స్ ఫర్ వెటర్నరీ స్టూడెంట్స్ అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. 14 టెక్నికల్ సెషన్లలో పలువురు విద్యార్థులు పేపర్లు ప్రజంటేషన్ చేశారు. అత్యుత్తమ ప్రజంటేషన్ చేసిన 42మంది విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసినట్లు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వి.వైకుంఠరావు పేర్కొన్నారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్.వినూ, డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు. వారు మాట్లాడుతూ వీసీసీ ఆధ్వర్యంలో ఒకే వేదికపై 14 రాష్ట్రాలకు చెందిన యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులను భాగస్వాములు చేయడం సంతోషంగా ఉందన్నారు. కాగా రూమినెంట్ మెడిసిన్ పీజీలో డాక్టర్ సాహితి, కంపానియన్ యానిమల్ మెడిసిన్ పీజీలో డాక్టర్ రజిత, వైల్డ్‌లైఫ్, ఏవియన్ ఎక్సాటిక్ పీజీలో డాక్టర్ ఎం.ప్రశాంత్‌కుమార్ (ఎస్వీవెటర్నరీ, తిరుపతి) ప్రథమ స్థానం, యూజీలో డాక్టర్ రెబ్‌కా(పీయూఆర్ఎన్‌టీ, కోరుట్ల) బహుమతులు అందుకున్నారు. ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.ధనలక్ష్మి, డాక్టర్ ఎస్.భారతి, డాక్టర్ ఎం.రఘునాథ్, డాక్టర్ నస్రీన్ పాల్గొన్నారు.

అతిథుల కోసం..!

- రెండు బ్యాటరీ వాహనాలు కొన్న పద్మావతి యూనివర్సిటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ రెండు బ్యాటరీ వాహనాలను కొనుగోలు చేసింది. హైదరాబాదుకు చెందిన భాగారియా ఏజెన్సీస్ నుంచి రూ.12.6 లక్షలతో వీటిని కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. యూనివర్సిటీ చేపట్టే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వయోభారంతో వచ్చే అతిథుల కోసం వీటిని వినియోగించనున్నారు. ఈ వాహనాలను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు గురువారం ప్రారంభించారు.

బ్యాటరీ వాహనాలను ప్రారంభిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని



జీఎస్టీ ఆధ్వర్యంలో నేటి నుంచి శిల్పారామంలో భారీ సేల్స్ ఎగ్జిబిషన్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ జీఎస్టీ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు వివిధ రకాల వస్తువులు భారీ అమ్మకాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జీఎస్టీ సహాయ కమిషనర్లు వరలక్ష్మి, శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార వర్గాల సహకారంతో ఎలక్ట్రానిక్, ఇంటికి సంబంధించిన వస్తువులు, ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు, సోలార్ పవర్ ప్యానెళ్ళు, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు. తగ్గించిన జీఎస్టీ ధరలు, వినియోగదారులకు అదనపు లాభం చేకూర్చడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

పంట పొలాలపై 'గజ'దాడులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

భాకరాపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బుధవారం రాత్రి ఎగపూరు గ్రామానికి చెందిన అమరేంద్ర, రెడ్డెమ్మ, విజయ సారథికి చెందిన సుమారు 5 ఎకరాలలో వరి పంటను ధ్వంసం చేశాయి. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో రాత్రి పంటలను ధ్వంసం చేసి, పగలు సమీపంలోని అడవిలోకి వెళ్లిపోతున్నాయి. గురువారం రాత్రి పూజారివాండ్లపల్లె, ఈదలచెరువు, పాలమాకులపల్లె, గాండ్లపల్లి వైపు వచ్చే అవకాశం ఉందని, రైతులెవరూ పంట పొలాల వైపు వెళ్లవద్దని అటవీ శాఖాధికారులు హెచ్చరించారు. గొర్రెలు, పశువుల కాపరులు అడవిలోకి వెళ్లవద్దని సూచించారు.

మళ్లీ మోదీ వస్తే రాజ్యాంగం కనుమరుగు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

వరదయ్యపాళెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో రాజ్యాంగం కనుమరుగై ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. వరదయ్యపాళెంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులకు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులకు గురువారం ఆయన హాజరయ్యారు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను సభ్యులకు వివరించారు. ప్రపంచ దేశాల మధ్య యుద్ధ వాతావరణం సృష్టించి లాభం పొందాలని అమెరికా ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశంలో సహజ వనరులను వినియోగించుకోవడంలో మోదీ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రాల్లోని బీజేపీయేతర ప్రభుత్వాలకు కేంద్రం సరిపడా నిధులు ఇవ్వడంలేదన్నారు. మోదీ ప్రభుత్వం రాజకీయ పార్టీలను బ్లాక్‌మెయిల్ చేస్తూ ఎదురు తిరిగితే జైల్లో పెడుతున్నారని ఆరోపించారు. దేశంలో లడఖ్‌తో తిరుగుబాటు మొదలైందన్నారు.దీని ప్రభావం అన్ని రాష్ట్రాల మీదపడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ స్థాయినుంచి సీపీఐని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బలమైన పార్టీ నిర్మాణం ఆవశ్యకత అంశంపై జేవీఎస్ మూర్తి, భారత దేశ చరిత్ర, సంస్కృతి, వక్రీకరణపై కొప్పర్తి వెంకట రమణమూర్తి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామానాయుడు,నాయకులు పి.మురళి, చిన్నిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అల్లర్లు రేపేందుకు అంబేడ్కర్‌ను వాడుకుంటారా?

నిరసన సభలో నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే పాశం

గూడూరు అర్బన్, 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి ప్రభుత్వంపై బురదజల్లేందుకు మహనీయుడైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను వాడుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించిన ఘటనను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, మాజీ మంత్రి పరసారత్నంతో పాటు పలువురు దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం తప్ప వేరే ఏ రాజకీయ పార్టీ దళితలకు మేలు చేయలేదన్నారు. దళితతేజం- తెలుగుదేశం కార్యక్రమం ద్వారా దళితుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను చంద్రబాబునాయుడు నేతృత్వంలో నిర్వహించడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లా వెదరుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించి, ఎన్డీఏ ప్రభుత్వంపైకి నెట్టి తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ నాయకులు కుట్రపన్నడం దుర్మార్గమన్నారు. పోలీసుల విచారణతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. దళితుల దేవుడైన అంబేడ్కర్ జోలికి వస్తే సహించేదిలేదని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో 52వేల మంది దళితులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా 192 మంది దళితులను చంపారని, ఈ పాపమంతా


అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, మాజీ మంత్రి పరసారత్నం

జగన్ అండ్ కో దేనన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ బాబాయి గొడ్డలి వేటు.. కోడికత్తి.. గులకరాయి ఘటనల మాదిరిగా దళితుల ఆర్యాధదైవం అంబేడ్కర్‌ను వాడుకోవాలనుకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీపతిబాబు, పెంచలయ్య, సురేంద్ర, అరవ పార్వతయ్య, కుమారి, రాజేంద్ర, రఘు, రాజా రమేష్, దళిత సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

కోట: మండల పరిధి లోని కేశవరం వద్ద గురువారం బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. కేశవరం గ్రామానికి చెందిన వేణు బైక్‌లో గూడూరు వైపు వెళ్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వేణు తీవ్రంగా గాయపడడంతో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాఠశాల తనిఖీ

కోట: మండల పరిధి లోని కేశవరం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మస్తానయ్య గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యాబోధన చేస్తూ విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా అంచనా వేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

వెంకటగికి టౌన్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలో పలు సమస్యలు పరిష్కరించాలని మాజీ ఉప ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడికి వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త ఎస్ఎస్ఆర్ నాయుడు గురువారం వినతిపత్రం అందించారు. తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన వెంకయ్య నాయుడిని కలిసిన ఎస్ఎస్ఆర్ నాయుడు ఎస్ఎస్ కెనాల్ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు, వెంకటగిరి చేనేతలకు స్టాండింగ్ మగ్గాలను మంజూరు చేయడానికి కృషి చేయాలని కోరారు.


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎస్ఆర్ నాయుడు తదితరులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గూడూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... బాలాయపల్లి మండలం గొట్టికాడుకు చెందిన జశ్వంత్(23) గూడూరులోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గొట్టికాడు నుంచి బైక్‌పై గూడూరుకు వస్తుండగా వెందోడు సమీపంలో మరో ద్విచక్ర వాహనం వేగంగా వస్తూ ఢీకొంది. ఈ సంఘటనలో జశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందగా ఎదురుగా వచ్చి ఢీకొన్న మరో ద్విచక్ర వాహనదారుడు శీనయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. జశ్వంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


జశ్వంత్ (ఫైల్‌ఫొటో)

దమ్ము, ధైర్యం గురించి వైసీపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు

ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పిరికి వాడిలా అసెంబ్లీకి రాకుండా ఇంటికే పరిమితమైన జగన్ దమ్ము, ధైర్యం గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక పోలేరమ్మ గుడి వద్ద నుంచి నిర్వహించిన జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అలిపిరి వద్ద టెర్రరిస్టులు దాడి చేసినా వెనకడుగు వేయని ధైర్యవంతుడు చంద్రబాబు, అలాంటి నాయకుడిని విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన బాధ్యత జగన్‌పై ఉంది. కానీ ఆయన పిరికివాడిలా తప్పించుకొంటున్నారంటూ ఎద్దేవా చేశారు. వెంక టగిరి వైసీపీ ఇన్‌చార్జి తనపై చేసే అవగాహన లేని వ్యాఖ్యలను తాను అసలు పట్టించుకోనని కురుగొండ్ల అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో వ్యాపా రులకు, సామాన్యులకు ప్రయోజనం కలుగు తుందన్నారు. కార్యక్రమంలో పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, సామల లక్ష్మీపతి, కేవీకే ప్రసాద్ నాయుడు, జానపాటి మురళి, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, తాండవ చంద్రారెడ్డి, గొల్లగుంట వెంకటముని తదితరులు పాల్గొన్నారు.


జీఎస్టీ అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే కురుగొండ్ల

ఘనంగా మత్స్యకార నేత సుందరయ్య వర్ధంతి


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకార నేత బొమ్మన సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక బస్టాండ్ కూడలిలో సుందరయ్య చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను అప్పటి ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చి వారికి అండగా నిలిచిన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, సెల్వం, నీలకంఠం, పళణి, సుదర్శన్, టీకే శ్రీనివాసన్, చంద్రయ్య, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే సుందరయ్య స్వగ్రామం వాటంబేడు కుప్పంలో మత్స్యకార నాయకులు సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పంచాయతీ విభజనను వ్యతిరేకిస్తూ

గ్రామసభను బహిష్కరించిన సర్పంచ్


గ్రామసభ నుంచి వెళ్లి పోతున్న సర్పంచ్ వెంకటసుబ్బయ్య

బాలాయపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం పంచాయతీలోని అక్కసముద్రం గ్రామాన్ని విభజించి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు గురువారం వెంగమాంబపురం సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి దయాకర్ గ్రామసభ నిర్వహించారు. మొత్తం 122 మంది హాజరుకాగా వైసీపీ సర్పంచ్ బాపనపల్లి వెంకట సుబ్బయ్య పంచాయతీ విభజనను వ్యతిరేకిస్తూ గ్రామసభను బహిష్కరించి వెళ్లిపోయారు. ఇంతలో ఇరుగ్రామాల ప్రజల మధ్య వివాదం రేగడంతో కొందరు కలగజేసుకుని సర్దుబాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి దయాకర్ గ్రామసభను వాయిదా వేశారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామంటూ అక్కసముద్రం గ్రామస్తులు వెనుతిరిగారు. అదే విధంగా నిడిగల్లు పంచాయతీ నుంచి గాజులపల్లి, గొల్లపల్లి గ్రామాలను విభజించి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయడానికి పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు, సర్పంచ్ చప్పిడి గాయత్రి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. 110మంది హాజరుకాగా 109మంది పంచాయతీ విభజనకు అంగీకరించగా ఒక్కరు వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రత్నమ్మ, నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడు ఆదివెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

పెళ్లకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు యూరియా పంపిణీని పీఏసీఎస్ అధ్యక్షుడు కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు అందిస్తున్నామన్నారు. స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ మండలంలోని 13 సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను పంపిణీ చేసేందుకు యూరియా పంపిణీ కార్డులను వ్యవసాయశాఖ అధికారులు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు నాగార్జునసాగర్, మండల వ్యవసాయాధికారి విజయ భారతి, ఏఈవో పుట్టయ్య, వీఏఏ సుమతి, టీడీపీ నాయకులు వేణురెడ్డి, చిట్టిరెడ్డి, పరంధామయ్య, వెంకటేశ్వర్లు మొదలియార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నెలబ్లల రైతుసేవా కేంద్రంలోనూ రైతులకు యూరియా పంపిణీ చేశారు.


యూరియా పంపిణీ చేస్తున్న కేవీ నాయుడు, ప్రసాద్‌నాయుడు, అధికారులు

విద్యా కిట్ల పంపిణీ

గూడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులకు గురువారం గాయత్రి పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాగుణాన్ని పెంపొందించేందుకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, సుప్రజ, రేవతి, రజని, మస్తాన్‌బీ, నాసిర, హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు: పాశం

కోట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటి నేరవేరుస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. కోట పట్టణంలో గురువారం జీఎస్టీ తగ్గింపు, రాయితీలు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు ఆవిష్కరించారు. ఇంటింటా తిరిగి జీఎస్టీపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం పుచ్చలపల్లిలో టీడీపీ మహిళా నాయకురాలు కర్మక్రియల్లో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీపతిబాబు, చిల్లకూరు దశరధ రామిరెడ్డి, నాయకులు మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తిరుమల శెట్టి కోటేశ్వరరావు, పాదర్తి కోటారెడ్డి, దారా సురేష్, షంషద్దీన్, మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి

చిల్లకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గిరిజన కాలనీలోని రోడ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ అన్నారు. గురువారం కృష్ణాపురం గిరిజన కాలనీలో తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్న మట్టిరోడ్ల పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు

కోట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెం పంచాయతీలో గల రామిరెడ్డి చెరువును రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఆ ప్రాంతంలో భూములను కొనుగోలు చేసిన ఓ వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా చెరువు ఎగువ భాగంలో నేలబావిని తవ్వారు. ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం చెరువులో అక్రమంగా తవ్విన బావిని పరిశీలించారు. ఈ బావిని మూడు రోజుల్లో పూడ్చివేయాలని తహసీల్దారు జయజయరావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.